వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము:51 మార్చి 2018 సంచిక: 03

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 51 మార్చి 2018 సంచిక : 03

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. సద్గుణనిధి శ్రీరాముడు- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. భగవత్ప్రేమ - శ్రీరామకృష్ణ పరమహంస - 10
04. శ్రీ మలయాళస్వామి జీవితవిశేషాలు -6 - డా॥ సముద్రాల లక్ష్మణయ్య -11
05. శ్రీరామనామ మహిమ - శ్రీమతి శిష్టా విజయభారతీలక్ష్మి - 14
06. శ్రీగురుదేవుల 20వ ఆరాధన - 20
07. మాతృదేవోభవ - ఆచార్య కె.సర్వోత్తమరావు - 21
08. భాగవత కథలు - భక్త ధ్రువుడు - శ్రీ రామచంద్రడోంగరే మహారాజ్ - 26
09. నామ సంకీర్తన - 29
10. భరతుడు - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 30
11. శ్రీ మదాంధ్ర మహాభాగవతము - ఆచార్య జక్కంపూడి మునిరత్నం-37
12. శైవసిద్ధాంతము - శైవాగమాలు - శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు- 39
13. వార్తలు - 42

ముఖచిత్రం :

శ్రీరామచంద్ర ప్రభువు సపరివారంగా

18.03.2018 ఆదివారం ఉగాది
25.3.2018 తేది శ్రీరామనవమి
27.3.18 ఏకాదశి పూజ్యశ్రీ మలయాళస్వాములవారి జన్మదినం
30.03.2018 పూజ్యశ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి ఆరాధన
3.4.2018 శ్రీస్వాములవారి జన్మదినం

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

– శ్రీ వ్యాసుల వారు

భజే విశేషసుందరం సమస్తపాప ఖండనమ్ ।
స్వభక్త చిత్తరంజనం సదైవ రామ మద్వయమ్ ॥ 1

జటాకలాపశోభితం సమస్త పాపనాశకమ్ ।
స్వభక్త భీతి భంజనం భజేహ రామమద్వయమ్ ॥ 2

నిజస్వరూపబోధకం కృపాకరం భవాపహమ్ ।
సమం శివం నిరంజనం భజేహ రామమద్వయమ్ ॥ 3

అసత్ప్రపంచకల్పితం హ్యనామ రూపవాస్తవమ్ ।
నిరాకృతిం నిరామయం భజేహ రామమద్వయమ్ ॥ 4

శివప్రదం సుఖప్రదం భవచ్ఛిదం భ్రమాపహమ్ ।
విరాజమానదైశికం భజేహ రామమద్వయమ్ ॥ 5

గొప్ప సౌందర్యముకలవారును, సమస్తపాపములను ధ్వంస మొనర్చువారును, భక్తికలవారి చిత్తమును రంజింపజేయువారును, అద్వయరూపులును అగు శ్రీరామచంద్రుని సదా భజించుచున్నాను.

జటాజూటమును ధరించినవారును! పాపములన్నిటిని పోగొట్టు వారును, భక్తుల భయమును తొలగించువారును, అద్వయరూపులును అగు శ్రీరామచంద్రుని సదా భజించుచున్నాను.

ఆత్మస్వరూపమును బోధించువారును, దయాస్వరూపులును, సంసార బంధనమును తొలగించువారును, మంగళకరులున్ను, నిరంజనులును, అద్వయరూపులును అగు శ్రీరామచంద్రుని భజించుచున్నాను.

ధర్మోద్ధరణ కొఱకై ఆకారమును కల్పించుకొనినవారును, నామరూప రహితులును, సత్యస్వరూపులును, నిరాజలును, అద్వయరూపులును అగు శ్రీరామచంద్రుని భజించుచున్నాము.

మంగళదాయకులును, సుఖదాయకులును, సంసారబంధమును, దుఃఖమును తొలగించువారును, జగద్భ్రమను నివారించువారును, ప్రకాశమానుడైన సద్గురువును,అద్వయరూపులును అగు శ్రీరామచంద్రుని భజించుచున్నాను.



సద్గుణనిధి శ్రీరాముడు

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

మనుష్య రూపమును ధరించిన సాక్షాత్పరమాత్మయే శ్రీరాముడు. వారు సద్గుణములకు నిధి . శ్రీరాముని గుణగణములయొక్క ప్రస్తావనతోనే రామాయణము ప్రారంభమైనది. గురుభక్తి, దైవభక్తి, పితృభక్తి, మాతృభక్తి, భ్రాతృప్రేమ మొదలైన ఉదాత్తగుణములు శ్రీరామునియందు విశేషముగ కానుపించుచున్నవి.

గురుభక్తి

శ్రీరాముడు తన గురుదేవులైన వసిష్ఠ, విశ్వామిత్రుల యెడల అపార భక్తిశ్రద్ధలు కలిగియుండెను. పదునాఱు సంవత్సరముల ప్రాయమున వసిష్ఠునివద్ద గొప్ప ఆధ్యాత్మికతత్త్వమును శ్రద్ధాభక్తులతో శ్రవణము చేసెను. అదియే యోగవాసిష్ఠమని ప్రఖ్యాతిజెందినది. ఇక విశ్వామిత్రునికడ అస్త్ర శస్త్రముల ప్రయోగమును గూర్చిన ధనుర్విద్యను చక్కగ గ్రహించెను. గురుదేవుని ఆజ్ఞానుసారము తాటకను వధించెను. యాగ సంరక్షణమును గావించెను. జనుల హితముకొఱకును, దేశ క్షేమము కొఱకును, మీవంటి అనుపమ ప్రభావశాలురైన మహాత్ముల ఆదేశమును పాలించుటకు నేను సర్వవిధముల సిద్ధముగ యున్నాను–అని విశ్వామిత్రునితో పలికిన వాక్యములు శ్రీరాముని గురుసేవాపరాయణతను వేనోళ్ళ చాటుచున్నవి. శ్రీరామలక్ష్మణులు నిరంతరము సావధానులైయుండి విశ్వామిత్రుని యాగమును జాగ్రత్తగా కాపాడిరి. యజ్ఞానంతరము విశ్వామిత్రుడు వచించిన ఈ క్రింది వాక్యములు శ్రీరాముని గురుసేవాపరాయణతను బాగుగ వెల్లడి చేయుచున్నవి.

కృతార్థోఽస్మి మహాబాహో కృతం గురువచస్త్వయా

‘ రామా ! నేను మిమ్మును బడసి కృతార్థుడనైతిని. మీరు గుర్వాజ్ఞను పాలించితిరి.’

పితృభక్తి :

శ్రీరాముని చరిత్రయందు పితృభక్తియను సుగుణము కొట్టవచ్చినట్లు కానిపించును. తండ్రి యెపుడు కనుపించినను రాముడు వారికి పాదాభివందనము చేయును. పితృవాక్య పరిపాలనము కొఱకై సర్వసంపదలతో గూడిన రాజ్యమును సైతము పరిత్యజించి పైపెచ్చు అనేక కష్టములతోగూడిన వనవాసమును ఆనందముతో స్వీకరించెను. అందులోను ఒక సంవత్సరముకాదు, రెండు సంవత్సరములు కాదు, పదునాలుగు వత్సరముల దీర్ఘకాలము అరణ్యవాసమున కంగీకరించెను. తండ్రిని గూర్చి శ్రీరాముడు కైకేయికి వెలిబుచ్చిన ఈ క్రింది వాక్యములు శ్రీరాముని పితృభక్తికి ప్రబల తార్కాణములు. ఎవనివలన ఈ ప్రపంచమున తన జన్మ సంభవించుచున్నదో అట్టి ప్రత్యక్షదైవమగు తండ్రికి అనుకూలమగు ఆచరణ ఎవడు చేయకుండును?

అహం హి వచనాద్రాజ్ఞః పతేయమపి పావకే ।

భక్షయేయం విషం తీక్ష్ణం పతేయమపి చార్ణవే ॥

“ తండ్రి చెప్పినచో నేను నిప్పులో దూకుటకుకూడ సిద్ధముగా నున్నాను. తీవ్రవిషము త్రాగుటకును సంసిద్ధుడనై యున్నాను. సముద్రములో పడుటకును సిద్ధముగ నున్నాను. మహారాజు నా యొక్క గురువు, తండ్రి, హితైషి. వారి ఆజ్ఞను బడసి నేనేది చేయకుండును?” పితృదేవుని ఆజ్ఞను శిరసావహించు నిమిత్తము శ్రీరాముడు సర్వసంపదలను తృణీకరించి అనేక కష్టములతో గూడిన వనవాసమున కియ్యకొనెను. వనమునుండి వెనుకకు రమ్మని ఎందఱో ఎన్ని విధములో చెప్పిచూచిరి. కాని పితృదేవుని ఆదేశపాలనయందు దృఢనిష్ఠుడైయుండి శ్రీరాముడు వెనుకకు మరలలేదు. పితృవాక్యమును పరిపాలించు నిమిత్తము, ఇంతటి త్యాగమును ఎవరు చేయగలరు? కావున వారి గొప్ప గుణములకు వారేసాటి. లోకమున తల్లిదండ్రుల యెడల

తనయులకు ఎంతటి భక్తిప్రపత్తు లుండవలెనో, తల్లితండ్రుల ఆదేశములను ఎంతటి శ్రద్ధావిశ్వాసములతో పాలించవలెనో, పెద్దల యెడల యెంతటి వినయ విధేయతలు గలిగియుండవలెనో శ్రీరాముని చరిత్ర జనులకు ప్రత్యక్షముగ చూపుచు, సర్వులకు మార్గదర్శకమై యొప్పుచున్నది.

మాతృభక్తి :

శ్రీరామునకు తండ్రియెడల ఎంతటి భక్తిప్రపత్తులు, కలవో, తల్లుల యెడల కూడ అంతటి భక్తి కలదు. తన తల్లియగు కౌసల్య యెడల ఎంతటి గౌరవభావము శ్రీరామునకు కలదో, అంతటి గౌరవము సుమిత్ర, కైకేయిల యెడల గూడ గలదు.కనుకనే వారెచట తటస్థపడినను శ్రీరాముడు ఆ తల్లులందఱికిని పాదాభివందనము చేయును. తనయొక్క వనవాసమును గూర్చియు, భరతుని పట్టాభిషేకముగూర్చియు కైకేయివలన వినిన తరువాత కూడ శ్రీరాముడు కైకేయి యెడల ఏ మాత్రము కినుక వహించక ఆ ప్రకారమే ఆచరించెదనని చెప్పి ఆమె పాదములకు ప్రణమిల్లి అచ్చోటువీడి చనెను. అరణ్యమునకు వచ్చిన భరతునకు హితము చెప్పుచు తల్లియగు కైకేయిని కోగించవద్దని పలికెను. మఱియు లక్ష్మణునితో ‘నీవు మాతయగు కైకేయిని ఎపుడును నిందించవలదు. ఇక్ష్వాకు వంశమునకు నాథుడగు భరతునిగూర్చియే చర్చించుము’ అని చెప్పెను. శ్రీరాముని ఉదాత్త స్వభావమును, గంభీరతత్త్వమును ఈ ఘటనలన్నియు స్పష్టముగ నిరూపించుచున్నవి.

భ్రాతృప్రేమ :

శ్రీరామునకు తల్లిదండ్రులందువలె, సోదరులయెడలకూడ మహా ప్రేమ కలదు. చిత్రకూటమున నివసించునపుడు భరతుని రాక సందర్భమున శ్రీరాముడు లక్ష్మణునితో పలికిన ఈ క్రింది వాక్యములు వారి భ్రాతృప్రేమను ఎత్తి చూపుచున్నవి – లక్ష్మణా ! భరతుని, శత్రుఘ్నుని, నిన్ను విడిచి, నాకేదైనసుఖము లభించునో దానిని అగ్నిదేవుడు కాల్చి భస్మము చేయుగాక ! భరతుడు నాకు ప్రాణములకంటెను అధిక ప్రియుడు.

భరతుడు వచ్చిన పిదప నీవు అతనితో కఠోర వాక్యములుగాని, అప్రియ వచనములుగాని పలుకవద్దు. అతనితో నీవేదైన ప్రతికూల వాక్యములను పలికినచో, అది నాతో పలికినట్లే యెంచబడగలదు' – ఇక లక్ష్మణుని యెడల శ్రీరామునకుగల అనల్పమగు ప్రేమ రామాయణమందు ఆచటచట స్పష్టముగ కానుపించుచున్నది.

వినయ విధేయతలు :

తాను అవతారమూర్తి అయినను, రాజాధిరాజుయొక్క పెద్దకుమారుడైనను శ్రీరామునకు తాను గొప్పవాడను అహంభావము ఏ కోశమునను లేదు. పెద్దల యెడల, ఋషులయెడల, మనుజుల యెడల ఎంతయో వినయ విధేయతలు గలిగియుండును. శ్రీరాముని చరిత్రయందు దంభముగాని, దర్పముగాని, అహంకారముగాని ఏ మాత్రము కానరావు. అహల్యకు శాపవిముక్తిని కలుగ జేయుటయేగాక శ్రీరాముడు ఆమె పాదములను స్పృశించి నమస్కరించెను. పరశురాముడు శ్రీరామునితో తనయొక్క భయంకరమైన విశాలధనుస్సునందు బాణమును సంధించి బలమును చూపుమని కోరగా శ్రీరాముడు ఆ ప్రకారమే చేసి పరశురాముని గర్వభంగము గావించినప్పటికిని, అనంతరము వారిని పూజించుట చూడగా శ్రీరామునకు ఎంతటి ఉన్నతస్వభావము, విశాలభావము కలదో వ్యక్తమగుచున్నది. శ్రీరాముని వినయవిధేయతలను ఈ రెండు సంఘటనలు ఎత్తి చూపుచున్నవి.

ఉగాది శుభాకాంక్షలు

వేదాన్తభేరి పాఠకులకు, చందాదారులకు, పోషకులకు మఱియు ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు. సర్వేషాం స్వస్తి భవతు. సర్వేషాం శాన్తిర్భవతు. సర్వేషాం పూర్ణం భవతు. ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥ ఓం తత్సత్॥

భగవత్ప్రేమ

– శ్రీ రామకృష్ణ పరమహంస

ప్రేమకు రెండు లక్షణాలున్నవి. **మొదటిది :** అది ప్రపంచాన్నే మరపింప జేస్తుంది. భగవత్ప్రేమ ఎంత తీవ్రమైనదంటే అది కలిగినవారికి బాహ్యప్రపంచ స్పృహే ఉండదు. చైతన్యదేవులు వనాన్ని చూచి బృందావనంగాను, సముద్రాన్ని చూచి యమునానదిగాను భావించేవారు.

రెండవది : అత్యంత ప్రియమైన తనదేహం పట్ల ధ్యాస ఉండకపోవడం. ఇందు దేహాత్మబుద్ధి సమూలంగా నశిస్తుంది.

భగవదనుభూతికి లక్షణాలు కొన్ని ఉన్నాయి. ఎవనిలోనైతే అనురాగసంపత్తి విశేషంగా వ్యక్తమవుతుందో అతడు భగవత్సాక్షాత్కారానికి అతిచేరువలో ఉన్నాడని గ్రహించవచ్చు. అనురాగ సంపత్తి అంటే ఏమిటి ? అవి – వివేకము, వైరాగ్యము, జీవులపట్ల దయ, సాధుసేవ, సాధు సాంగత్యము, భగవంతుని నామ గుణ కీర్తనలు, సత్యసంధత మొదలైనవి. అనురాగంయొక్క ఈ లక్షణాలను చూచినప్పుడు భగవద్దర్శనం అయ్యేకాలం ఎంతో దూరంలో లేదని నిశ్చయంగా చెప్పవచ్చును.

భక్తిమార్గాన్ని అవలంబించడం ద్వారా అంతరింద్రియాలు (మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం) వాటంతట అవే నియంత్రించబడుతాయి. అది సులభమైన మార్గం. భగవంతుని పట్ల ప్రేమ అధికరించే కొద్దీ ఇంద్రియ సుఖాలు చప్పగా, రుచిహీనంగా గోచరిస్తాయి. తమ పిల్లవాడు మరణించిన రోజు దంపతులకు శారీరక సుఖంమీద మనస్సు పోతుందా ?

భగవన్నామాన్ని జపించడం ద్వారా పాపాలన్నీ తొలగిపోతాయి. కామక్రోధాదులు, ఇంద్రియ సుఖాలపట్ల ఆసక్తి అన్నీ పారిపోతాయి. ఆయన (భగవంతుని) నామం పట్ల రుచి జనించాలని భగవంతుణ్ణి వ్యాకుల హృదయంతో ప్రార్థించండి. ఆయన తప్పక నీ మనోవాంఛితాన్ని నెరవేస్తాడు.

శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 6
భగవత్కరుణానుభవం

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

ఒక సందర్భంలో శ్రీ సద్గురు మలయాళస్వాములవారు తిరుమలలో తమకు గలిగిన భగవత్కరుణానుభవాన్ని గురించి ఇలా చెప్పారు.

“ గోగర్భతీర్థంలో తపస్సు చేసే దినాలలో మొదట జనులు ఎక్కువగా వచ్చేవారు కారు. నేను గుడికి వెళ్ళినప్పుడు శ్రీ తిరువేంకటా చార్యులనే శ్రీ వైష్ణవులు నాకు ప్రసాదం ఇచ్చేవారు.

ఒక సంవత్సరం వర్షాకాలంలో వర్షాలు ఎక్కువగా కురిశాయి. గోగర్భతీర్థం మితిమించి ప్రవహించింది. మూడు దినాలు అక్కడి కాలువ దాటి రావడానికి వీలులేని పరిస్థితి సంభవించింది.

ఆ దినాలలో ఏ వస్తువునూ దగ్గఱ ఉంచుకొనేవాడను కాను. ఆకలిబాధ ఎక్కువయింది. అప్పుడు శివానందలహరిలోని ఈ క్రింది శ్లోకాన్ని ఆర్తితో స్మరించాను.

స్మృతే శాస్త్రే వైద్యే శకునకవితాగాన ఫణితౌ
పురాణే మంత్రే వా స్తుతినటన హాస్యేష్వచతురః ।
కథం రాజ్ఞాం ప్రీతి ర్భవతి మయి కోఽహం పశుపతే
పశుం మాం సర్వజ్ఞ ! ప్రథితకృపయాపాలయ విభో !

(దీని తాత్పర్యమిది–స్మృతియందూ, శాస్త్రంలోనూ, వైద్యంలోనూ, శకునాలయందూ, కవిత్వంలోనూ, గానంలోనూ. వాక్చమత్కారం ప్రదర్శించడంలోనూ,పురాణములోనూ,మంత్రంలోనూ, స్తుతించడం లోనూ, నటించడంలోనూ, హాస్యంలోనూ నేను నిపుణుడను కాను. ఇట్టి నా యందు రాజులకు ప్రీతి ఎలా కల్గుతుంది ? పశుపతీ! నేనెవడను ? సర్వజ్ఞా! ప్రభో ! పశుప్రాయుడనైన నన్ను ప్రసిద్ధమైన నీ దయతో పరిపాలించు ”. ఇలా భగవంతుణ్ణి ప్రార్థించినప్పుడు సమయం పగలు మూడు గంటలయింది. దేవాలయంలో నైనేని సుబ్బరాయశెట్టి అనే ఒక భక్తుడు నాపై విశ్వాసం కల్గి వుండేవాడు. అతడు నాటి మధ్యాహ్నం భుజించి నిద్రిస్తుండగా శ్రీ వేంకటేశ్వరస్వామి అతనికి కలలో కనిపించి “ఫలానా భక్తుడు ఉపవాసంతో ఉన్నాడు. అన్నం తీసుకుపోయి పెట్టు ” అని చెప్పాడు.

ఆ దినం మైసూరు సత్రంలో ఒక ఉపనయనం జరిగింది. అన్నదానం జరుపగా మిగిలిన నల్గురికి సరిపడే అన్నం తీసుకొని అతడు గోగర్భానికి వచ్చాడు. కాలువ దాటరాని ప్రవాహంతో ఉన్నది. ఒక వెదురుగడకు అన్నం మూటకట్టి నాకు అతడు కాలువ ఆవలి వైపు నుండి అందజేశాడు. స్వప్న వృత్తాంతం గూడ తెలియపరిచాడు. ఇది జరిగిన తరువాత నాటి మహంతు నాకు భోజనం ఏర్పాటు చేయునట్లు కొన్ని సూచనాత్మకమైన దైవలీలలు కల్గినట్లు చెప్పారు.

దైవ విశ్వాస ప్రభావ మట్టిది. గోగర్భంలో కాలువపైన తదుపరి కొంతకాలానికి దృఢమైన వంతెన కట్టారు. అలా దైవాన్ని ప్రార్థించవలసిన స్థితి ఒక్కసారే సంభవించింది. మరల అట్టి సంకటపరిస్థితి కల్గలేదు. సాకారభక్తి మూఢత్వం అని తలంచరాదు. ఇట్టివి కల్పిత కథలని చెప్పరాదు. అందరినీ, అన్నిటినీ పరిత్యజించి వచ్చి ఒక్క ఈశ్వరుణ్ణే నమ్మిన వానికి సహాయం లేకపోయెనే అన్న భావంతో అప్పుడాలాగున ప్రార్థించడమైనది.

ఒకసారి తీవ్ర ధ్యాననిష్ఠలో ఉండి స్వామి గుడికి ఆలస్యంగా వెళ్ళారు. వారికి నిత్యం ప్రసాదం అందజేసే వంటవారు అప్రీతిగా

ప్రవర్తించారు. ఇక స్వామి ప్రసాదానికై గుడికి పోగూడదన్న నిర్ణయానికి వచ్చారు. ఒక దినం అలా గడచిపోయింది. మరునాడు తిరుపతి నుండి ఒక భక్తుడు సతీసమేతంగా వచ్చి వంటచేసి ' స్వామీజీకి పెట్టాలి' అంటూ నిరీక్షించాడు. స్వామి గోగర్భ గుహలో ధ్యానంనుండి సాయం సమయానికి లేచి వచ్చారు. భక్తుడు స్వామికి ప్రణమిల్లి 'భిక్ష స్వీకరించండి' అని ప్రార్థించాడు. అప్పుడు స్వామి హర్షాశ్రువులు జాలువారగా

అనన్యాశ్చింతయంతోమాం యే జనాః పర్యుపాసతే ।

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥

అన్న గీతశ్లోకాన్ని స్మరించారు. అది మొదలు స్వామికి ఎప్పుడూ ఆహారంలో కొరత కలుగలేదు. వేలకొలది జనానీకానికి వేదాంత సభల్లో అన్నదానం స్వామీజీ జరిపించినారు. అదే భగవల్లీల.

"త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు " కు ఈక్రింది వారు పైకం పంపినారు

(1). శ్రీ కె.వెంకటరమణమూర్తిగారు (విశాఖపట్టణం) రూ.30,000/-

సద్గురు సర్వ సేవా ట్రస్టుకు అన్నదానానికి ఈక్రింది వారు పైకం ఇచ్చినారు

(1). శ్రీమతి పి.లక్ష్మీదేవి, కేరాఫ్ ::ద్వారకనాథరెడ్డి (కడప) రూ.10,000/-

(2). శ్రీమతి పి.వాణి, భర్త : ఎస్.కె.వి.బి.ఎన్.శర్మ రూ.20,000/-
(వడ్డీతో సీతంరాజు ఉష పేరిట అన్నదానం)

వేదాన్తభేరి పోషకచందా ఈ క్రింది వారు పంపినారు

(1). టి.శ్రీనివాసరావు (కర్నూలు) రూ.1500/-

(2). అమరవాది పండరయ్య (వనపర్తి) రూ.1500/-

(3). బి.మొగిలయ్య (ఎరుప్మల్ల- కొడంగల్) రూ.1500/-

(4). కె.ఎస్. కృష్ణమూర్తి (విశాఖపట్నం) రూ.1500/-

(5). బోగా లక్ష్మీనారాయణ (రఘునాథపురం) రూ.1500/-

(6). కె.వి.సూర్యనారాయణశాస్త్రి (హైద్రాబాద్) రూ.1500/-

(7). కుటీర బ్యాంకుమెన్ వాసవి ఓల్డేజ్‌హోమ్ ట్రస్టు రూ.1500/-

శ్రీరామ - నామ మహిమ

- శ్రీమతి శిష్టా విజయభారతీలక్ష్మీ (భీమవరం)

హనుమంతుడు పరబ్రహ్మ స్వరూపమగు శ్రీరామునికి పరమభక్తుడు. శ్రీరామ నామామృతాన్ని లోకానికి పంచింది హనుమయే. అతని రోమ రోమం రామ నామాన్ని ఉచ్చరిస్తూ ఉంటుంది. మారుతి హృదయంలో శ్రీ సీతారాములు కొలువై ఉంటారు. రామ నామ సంకీర్తన వినిపించినంతనే అంజలి ఘటించి శిరస్సు వంచి ఆనందాశ్రువులు నిండిన కన్నులతో పరవశించిపోతాడు. అట్టి రామభక్తుడగు హనుమకి నమస్కారం అంటాడు తులసీదాసు.

" యత్ర యత్ర రఘునాథ కీర్తనం తత్ర తత్ర కృతమస్తకాంజలిం ।

భాష్పవారి పరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షసాంతకం ॥ "

శ్రీరాముడు వ్యాపక బ్రహ్మము. మాయారహితుడు, పరమానంద స్వరూపుడు, పరాత్పరుడు, చిన్మయస్వరూపుడు. అవినాశియగు ఆ అవ్యక్త పరబ్రహ్మమే భక్తులపట్ల ప్రేమకు వశుడై సగుణరూపం ధరించాడు. నీటికి, మంచుగడ్డకు భేదం లేనట్లే సగుణ, నిర్గుణములకు భేదం లేదు. అలాగే రామునికి, రామనామానికి భేదం లేదు. "శ్రీరామ రామ యనుచు రమియింతు రామునందు". నాలో నేనే ఆత్మారాముడనై నిరంతరం ఆనందిస్తూ ఉంటానన్నాడు పరమశివుడు.

"కేవలమకారోకారమర్ధమాత్రా సహితం ప్రణవముహ్యయో ।

రామ రామ మంత్రం జపతి తస్య శుభకరోఽహం స్యామ్ (॥రా॥తా॥ఉ)

ర్ + ఆ=రా,మ్ +అ=మ అనే బీజాక్షరాలే ఓంకారంలోని "అ"కార, "ఉ"కార, "మ"కార, అర్ధమాత్రలు. రామమంత్రం ప్రణవాత్మకమని భావించి జపించేవారి యోగక్షేమాలు నేను నిరంతరం చూచుకొందునని శ్రీరాముడు స్వయంగా చెప్పాడు. శ్రీకృషపరమాత్మ కూడ భక్తులకు ఇలాగే వాగ్దానం చేశాడు.

"అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ (భ.గీ.9/12)

ముక్తిమార్గం :

కృతయుగంలో మానవులు ధ్యానంవలన జ్ఞానులై ముక్తి పొందారు. త్రేతాయుగంలో జప తపాదులు, యజ్ఞ యాగాదుల ద్వారా తరించారు. ద్వాపరంలో విగ్రహారాధన ప్రారంభమైంది. దాని ద్వారా జనులు కృతార్థులయ్యారు. కలియుగంలో రామనామమే ముక్తికి మార్గమని చెప్పబడింది.

““రామేతి వర్ణద్వయమాదరేణ సదాస్మరన్ ముక్తి ముపైతి జంతుః ।

కలౌయుగే కల్మష మానుషాణాం అన్యత్ర ధర్మే ఖలునాధికారః ॥”

“రామనామం అనునిత్యం భక్తి శ్రద్ధలతో జపించిన మానవులు ముక్తి నొందుతారు. కలుషిత చిత్తులగు కలియుగ మానవులకు ఇంతకు మించిన ముక్తి మార్గము మరొకటి లేదు.

“ధర్మమార్గం చరిత్రేణ జ్ఞాన మార్గంచ నామతః ।

తథా ధ్యానేన వైరాగ్యం ఐశ్వర్యం తస్య పూజనాత్ ॥”(రా.తా.ఉ.)

అనగా, రామకథను చెప్పినా, విన్నా ధర్మమార్గం అలవడుతుంది. రామ నామం జపిస్తే జ్ఞానం కలుగుతుంది. రాముని పూజిస్తే ఐశ్వర్యం లభిస్తుంది. రామధ్యానం వల్ల వైరాగ్యం ప్రాప్తిస్తుంది. రామనామం ఇహపరములకు ఆధారం.

“రాం రామాయనమః” అను షడక్షరీమంత్రమే తారకమంత్రం.కాశీలో శరీరం వదిలే జీవునికి రుద్రుడు ఈ తారక మంత్రాన్ని ఉపదేశించి గర్భజన్మ మరణాదులనుండి తరింపజేస్తాడని యాజ్ఞవల్క్యుడు భరద్వాజునికి బోధించాడు. ఇంతే కాదు, రామనామ మహిమ నీ విధంగా ఉపదేశించాడు.–

“నామ్నాం సహస్రం దివ్యానాం స్మరణే యత్ఫలం లభేత్ ।

తత్ఫలం లభతే నూనం రామోచ్చారణ మాత్రతః ॥” (రా.తా.ఉ.)

ఇదే విషయాన్ని అధ్యాత్మరామాయణంలో పరమేశ్వరుడు పార్వతీదేవికి ఉపదేశించినట్లుగా చెప్పబడింది. “శ్రీరామ రామ రామేతి రమేరామే మనోరమే సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ” అనగా, శ్రీరామనామం ముమ్మారులు ఉచ్చరిస్తే విష్ణు సహస్రనామ పారాయణ చేసిన ఫలం

లభిస్తుందని భావం.

బ్రహ్మాదులు ప్రత్యక్తత్త్వమున కభిన్నమైన సత్య జ్ఞానానంద స్వరూపమునందు ఎల్లప్పుడూ రమిస్తూ ఉంటారు. కాబట్టి రామ అని పేరు వచ్చినదని ఋగ్వేదంలో చెప్పబడింది. శ్రీరామమంత్రాన్ని తెలిసి జపించినవారు జీవన్ముక్తులగుదురనుటలో ఏ మాత్రం సందేహం లేదు. “రామ మంత్రార్థ విజ్ఞానీ జీవన్ముక్తో నసంశయః ॥.

“రామ ఏవ పరం బ్రహ్మ రామ ఏవ పరంతపః ।

రామ ఏవ పరం తత్త్వగ్ం శ్రీరామో బ్రహ్మతారకః ॥” (సీ.రా.సం)

అనగా, రాముడే పరబ్రహ్మ, రాముడే పరమాత్మ, రాముడే పరతత్త్వం, రాముడే బ్రహ్మతారకం అని సీతామాత బోధించింది. రామమంత్రాన్ని ఒక్కసారి నోట పలికినంతనే సింహగర్జన వినగానే లేళ్లు భయపడి పారిపోయినట్లు సమస్త పాపాలు తొలగిపోతాయి.

“రా” శబ్దోచ్చారణాదేవ ముఖాన్నిర్యాంతి పాతకాః ।

పునః ప్రవేశ భీత్యాచ “మ” కారస్తు కవాటవత్॥ ॥ (రా.తా.ఉ.)

‘‘రా’’ అను శబ్దమునుచ్చరించినంతనే లోపలనున్న పాపసమూహమంతా బయటకు వచ్చేస్తుంది. “మ” కారమనే కవాటం మూయగానే బయటపడిన పాపాలు మఱల లోనికి ప్రవేశించ సాహసించవు.” తులసీదాసు కూడా ఈ భావమే ఇలా చెప్పాడు –

“ తులసీ ‘రా’ కే కహతహీ నికసత పాప పహార్ ।

ఫిరి బీతర ఆవత నహీ దేత ‘మ’ కార కివార్॥ ”

రామనామం ఉచ్చరించినంతనే “ఈప్సితంబుల నర్థుల కిచ్చుచుందు”. రామనామం వల్ల భక్తుల కోరికలు తీరుట చూచి కల్ప వృక్షం, కామధేనువు, చింతామణి సిగ్గుపడినవట.

శివశక్తుల సమ్మేళనం :

“ ‘రా’ చేతి లక్ష్మీ వచనో ‘మ’శ్చాపీశ్వర వాచకః ।

లక్ష్మీపతిం గతిం రామం ప్రవదంతి మనీషిణః ॥ ”

'రా' యను బీజాక్షరం (లక్ష్మీ) శక్తి బీజమనియు, 'మ' యను బీజాక్షరం శివ బీజమనియు, రామ నామం శివశక్తి సమ్మేళన మనియు, అట్టి రాముడు ఈశ్వరుడనియు, సమస్తజీవులకు గతి యనియు పండితుల అభిప్రాయం.

త్రివేణి సంగమం :

రామ నామం ఉచ్చరించే ప్రదేశాలలో గంగ, యమున, సరస్వతి మొదలైన సమస్త పుణ్య తీర్థములు అంతర్గతంగా ప్రవహిస్తూ ఉంటాయి. కాబట్టి రామ నామంతో సరితూగు పుణ్యతీర్థం మరియొకటి లేదు. అమృతమే ఆహారంగా తీసుకునే దేవతలు కూడ శాశ్వత పరమపద సుఖాన్నిచ్చే శ్రీరామ నామామృతాన్నే కోరుచుందురు. అట్టి నామామృతం ఉండగా రామ భక్తులకు క్షణిక సుఖాలనిచ్చే స్వర్గాదు లెందుకు ? అవసరం లేదని భావం.

అష్టాక్షరీ పంచాక్షరీల సంగమం రామనామం :

"రా' కారో వైష్ణవే గ్రాహ్యః 'మ'కారో శైవ సంగ్రహః ।

రామ్యేత్యక్షరయుగ్మంతు శైవ వైష్ణవ సారవత్ ॥ "

వైష్ణవులు జపించు అష్టాక్షరీ మంత్రం " ఓం నమో నారాయణాయ" లోని 'రా' అను బీక్షాక్షరం, శైవులు జపించు పంచాక్షరీ మంత్రం " ఓం నమః శివాయ" లోని 'మ' అను బీజాక్షరం కలసి "రామ" మంత్రమైనది. అనగా శైవులు, వైష్ణవులు జపించు మంత్రాలలోని సారమే రామమంత్రం. శైవ, వైష్ణవులకు 'రామ' నామమే మిక్కిలి సులభమైన మోక్షోపాయం.

పారలౌకిక జీవితానికి రామనామం మార్గదర్శకం. రామనామం జపించడం వల్ల అంతరంగంలో చైతన్యజ్యోతి అనుభూతమవుతుంది. బాహ్య ప్రపంచంలో సర్వవ్యాపకమైన పరంజ్యోతి దర్శనమిస్తుంది. అంటాడు తులసీదాసు. అనగా ఏకాత్మ భావన, సర్వాత్మ భావన గలుగుతుందని భావం.

సగుణ బ్రహ్మము :

"ఎన్నగాను రామభజనకన్న మిక్కిలున్నదా?" అంటూ శ్రీరామ నామామృతాన్ని పానం చేసిన భక్తరామదాసు "శ్రీరామ నీ నామ మేమి రుచిరా" అని పరవశించి తన అనుభూతిని ఇలా వర్ణించాడు.

" చిక్కని పాలపై మిసిమి చెందిన మీగడ పంచదారతో

మెక్కిన భంగి నీ విమల మోచక రూప (నామ) సుధారసంబు నా

మక్కువ పళ్ళెరంబున సమాహిత దాస్య మనేటి దోయిటన్

దక్కెనటంచు జుఱ్ఱెదను దాశరథీ కరుణా పయోనిధీ ॥ "

రామనామం ఎంతో రుచికరమైనదనీ, చిక్కని పాలమీద తెట్టు కట్టిన మీగడ పంచదారతో కలిపి జుఱ్ఱినంత తృప్తినిస్తుందనీ, రామ దర్శనం వల్ల తనకు గలిగిన అనుభూతిని రామదాసు మైమరచి వర్ణించాడు. తన ప్రియురాలిని "రామా" అని పిలిచిన కాముకునికి మోక్షము నిచ్చిన రామ నామ మహిమ వర్ణింప నెవరితరం ? ఒక వేశ్య మరణ సమయంలో "రామా' అని పెంపుడు చిలుకను పిలిస్తే ముక్తి లభించగా నిరంతరం రామ నామాన్ని జపించే వారి కేమి లోటు అని కృష్ణ శతకకారుడు అన్నాడు –

" చిలుక నొక రమణి ముద్దుల

చిలుకను శ్రీరామ యనుచు శ్రీపతి పేరన్

బిలచిన మోక్షము నిచ్చితి

వలరగ నిను దలచు జనుల కరుదా కృష్ణా "

రత్నాకరుడనే పరమ కౄరాత్ముడు నారదుని ద్వారా ఉపదేశం పొంది అపసవ్యంగా "మరా మరా" అని జపించినప్పటికి సిద్ధిపొందాడు. వాల్మీకి మహర్షి అనే పేరుతో సంస్కృత భాషలో రామాయణం రచించి ఆదికవిగా ప్రఖ్యాతి చెందాడు. సమర్థ రామదాసు "శ్రీరామ జయరామ జయజయరామ" అని నామ జప సాధన చేయగా సాక్షాత్తు శ్రీరాముడే గురువై వచ్చి అతనికి మోక్ష మార్గాన్ని సూచించాడు.

పరతత్త్వమసి :

నాదబ్రహ్మ, సంగీత కళోపాసకుడునగు త్యాగరాజు "రామా నీ సమానులెవరు" అనియు, "నిన్నే నెరనమ్మినానురా ఓ రామయ్య !" అనియు, సగుణరూపునిగా శ్రీరాముని ప్రార్థించాడు. "వాచామగోచరమే మనసా, వర్ణింప తరమే రామ నామ మహిమ" అనియు, "తత్త్వమెరుగ తరమా, పరతత్త్వమెరుగ తరమా" యని శ్రీరాముని స్తుతించినాడు. తన జీవితాన్ని సార్థకం చేసుకొన్నాడు.

శ్రీ మలయాళ సద్గురు మహా సామ్రాట్ నమస్తే! ప్రభూ!

– శ్రీ జైత్ర పరమాత్మ గారు (శ్రీ బ్రహ్మవిద్యాగురుకులాశ్రమము, సత్రంపాడు)

ఓ మౌనీశ్వర ! యో దయాగుణమయా ! యో జ్ఞాన భట్టారకా !
యో మేధాసునిధాన ! యో శ్రితముముక్షూద్ధారకా ! యో తప
స్యామగ్నామృతమూర్తి! యో పరమహంసా! యో పరివ్రాజక
స్వామీ! యోమలయాళ సద్గురు మహాసామ్రాట్! నమస్తే! ప్రభూ ! 1

ఘోరంబైన తపం బొనర్చితివి భర్గుం గూర్చి శేషాద్రిపై
ధీరత్వంబునఁ బాపనాశన మహాతీర్థంబునం దట్టులే
క్రూరవ్యాఘ్ర నివాస కాననమునం గోగర్భ తీర్థంబునం
దారూఢిం దపముండి పొందితివి నీ వాధ్యాత్మికౌన్నత్యమున్. 2

కాదేనిం దమ యాతపోవిభవమా కారుణ్య హృద్వృత్తమా
వేదాంతాగమ బోధనానుభవ మావిఖ్యాతసచ్చిన్మ యా
హ్లాదస్ఫూర్తి ఘటిల్లెనే ! యెవరియందైనం గురూ ! నీవు శ్రీ
వేదవ్యాసమహర్షివే ! నిజమయా ! విజ్ఞాన రత్నాకరా ! 3

ఉపనిషదర్థంబు లూహకందెడు రీతి
    విప్పి చెప్పఁగఁ జాలు గొప్పతనము
బ్రహ్మసూత్రంబుల పరమరహస్యముల్
    ప్రవచింపఁ జాలెడు ప్రౌఢిమంబు
శ్రీకృష్ణగీతాప్రసిద్ధ భావశ్రేణి
    వ్యక్తం బొనర్చెడు యుక్తిబలము
శంకర ప్రముఖులు సల్పిన ప్రకరణ
    గ్రంథావళుల బోధగరపు నేర్పు
దమకుఁ బ్రత్యేక పద్ధతిఁ దనరు నదియు
నన్యదుర్లభమని ప్రాజ్ఞు లభినుతింప
నపరశంకర యతియన నలరినావు
స్వామి ! మలయాళ సద్గురు సార్వభౌమ !

(సద్గురు మలయాళస్వాములవారి జన్మదినం 27-3-18 చైత్రశుద్ధ ఏకాదశి పుణ్య సందర్భంగా (సం॥)

గురుదేవుల 20వ ఆరాధన

శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపకులు, గీతామకరంద గ్రంథకర్తలు **పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి 20వ ఆరాధనోత్సవాలు 2018వ సంవత్సరం మార్చి 30వ తేది నుండి ఏప్రిల్ 3వ తేది వరకు అనగా** విళంబినామ సంవత్సర చైత్ర శుద్ధ చతుర్దశి నుండి చైత్ర బహుళ తదియ వరకు శ్రీకాళహస్తిలోని శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగును.

2018 మార్చి 30వ తేది శ్రీస్వాములవారి 20వ ఆరాధన.

2018 ఏప్రిల్ 3వ తేది శ్రీస్వామి వారి జన్మదినోత్సవం ఈ మధ్య దినాలలో ఆశ్రమ వార్షికోత్సవం, త్రినేత్ర వైద్యాలయ వార్షికోత్సవం జరుగును. ఈ ఆరాధనోత్సవాలలో అందరికి సాదర ఆహ్వానము. ఈ ఆరాధనోత్సవాలలో అనేకమంది మహాత్ములు తమ ప్రవచనలను చేస్తారు. పూజ్యశ్రీ శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు అధ్యక్షత వహిస్తారు.

1.పూజ్యశ్రీ దండి నిర్మలానందగిరిస్వాములవారు (తెనాలి).

2. పూజ్య శ్రీ స్వస్వరూపానందగిరిస్వాములవారు (శ్రీనివాసమంగాపురం)

3. పూజ్యశ్రీ ప్రణవానందగిరిస్వాములవారు (లత్తవరం)

4.పూజ్యశ్రీ శ్రీహరితీర్థ స్వాములవారు (ఇనమడుగు)

5. పూజ్యశ్రీ డా॥ కరిబసవరాజేంద్రస్వాములవారు (ఉరవకొండ)

6. పూజ్యశ్రీ మాతా జ్యోతిర్మయానందభారతి వారు (పాలకొల్లు)

7. పూజ్యశ్రీ మాతా పరావిద్యానందగిరిస్వామిని వారు (యాచారం)

8. పూజ్యశ్రీ యోగిని చంద్రకాళీ ప్రసాదమాతాజీవారు (నంబూరు)

9. పూజ్యశ్రీ సాధుమాతగారు, శ్రీకృష్ణానందమఠం (హైద్రాబాద్)

10. పూజ్యశ్రీ మాతా గురుచరణానందస్వామిని వారు (కొక్కరచేడు)

11. బ్రహ్మశ్రీ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు (తిరుపతి)

12. బ్రహ్మశ్రీ రామలాల్‌శర్మ గారు (సంస్కృత విద్యాపీఠం తిరుపతి)

మాతృదేవోభవ

- ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

“ విను తల్లియును దండ్రియును గురుండును
సేవనీయులు సద్భక్తి నిత్యనిరతి ”

అని ధర్మరాజుకు భీష్మ పితామహుడు మహాభారతంలో తెలిపి యున్నాడు. అట్లే శ్రీరాముడు సీతాదేవితో – మాతాపితృసేవనమునకు సత్యపాలనం గాని, దానమానాలు గాని, భూరిదక్షిణలతోడి యజ్ఞాచరణములు గాని సాటిరావు” అన్నాడు.

‘భూ ప్రదక్షిణషట్కేన కాశీయాత్ర శతేన చ
సేతుస్నాన శతైర్యశ్చ తత్ఫలం మాతృ వందనే ”

ఆరుసార్లు భూప్రదక్షిణ చేస్తే ఎంతపుణ్యమో, నూరు సార్లు కాశీయాత్ర చేస్తే ఎంత ఫలమో, వందసార్లు రామేశ్వర దర్శనం, సేతుస్నానం చేస్తే ఎంత ఫలమో ఆ ఫలమంతా తల్లికి నమస్కారం చేస్తే సిద్ధిస్తుంది.

శ్రీ మద్రామాయణంలో తల్లిదండ్రులపై అనురాగం, సేవానురక్తిని ప్రకటించిన శ్రవణకుమారవృత్తాంతం విస్మరింపరానిది. శ్రవణుడు ఋషికుమారుడు. వృద్ధులయిన తల్లిదండ్రుల సేవలో తరించినవాడు. తల్లిదండ్రులు దప్పికతో నీరు అడుగగా శ్రవణ కుమారుడు సరయూ నదిని చేరుకున్నాడు. నీరు డొప్పలలో నింపు కుంటుండగా ఆ సవ్వడి ఏనుగు నీరుత్రాగెడి సవ్వడిలాగ వినబడగా దశరథుడు బాణం వేశాడు. ఆయువుపట్టులో ఆ బాణం తగిలింది. అపుడాతడు తల్లిదండ్రులను తలచుకొంటూ విలపించసాగాడు. ఆ తల్లిదండ్రులు శక్తిహీనులు, అంధులు. తాను మరణిస్తే వారేమై పోతారో–అని ఆక్రోశించాడు. ‘తదేతన్మిథునం వృద్ధం చిరకాల భృతం

మయా.’ వారికి దిక్కెవ్వరు ? అని బాధపడుతుంటే దశరథుడు చలించాడు. చివరకు ఋషికుమారుని ఆనతితో శ్రవణకుమారుని తల్లిదండ్రుల దగ్గరికి వెళ్ళి రెక్కలు లేని పక్షులలాగ ఉన్న వారిని చూచి భయకంపితుడయ్యాడు. అపుడా వృద్ధ దంపతులు.

“నాయనా ! కుమారా ! నేను గాని మీ అమ్మగాని నీకేదైనా అప్రియం చేశామా ? మా వల్ల ఏదయినా అపరాధమా ? మా సమస్త ప్రాణాలు నీపైనే ” అని పలకరిస్తున్నారు. చివరకు జరిగిన తొందరపాటు తెలిసి కొడుకు దగ్గరికి చేర్చమన్నారు. అలాగే చేశాడు దశరథుడు. వారు కళేబరాన్ని స్పృశించి

“నీవు నమస్కరించడం లేదే. నేలపై పడుకొన్నావేమి ? నా మీద ప్రేమలేకపోతే కనీసంతల్లినైనా చూడు. ఉషఃకాలంలో హృదయంగమంగా, మధురంగా పఠించే శాస్త్రాలు, పురాణేతిహాసాలు ఇకపై ఎవరి ద్వారా వినగలను ? కర్మానుష్ఠానము చేయలేనివాడను. ప్రియమయిన అతిథిగా గౌరవించి కందమూలఫలాలు తెచ్చి యిచ్చేవారెవరు ? పంచ ప్రాణాలు నీపైననే పెట్టుకొని అనుక్షణం నీకై పరితపించే నీ తల్లి ఇదిగో. ఆమె వృద్ధురాలు దీనురాలు’ అన్నాడు. అపుడు మరణించిన కుమారుడు దివ్యరూపంతో ‘తల్లి దండ్రులార ! భక్తి శ్రద్ధలతో పరిచర్య చేయడం వల్లనే నాకు దివ్యస్థానం దక్కింది. మీరును నన్ను చేరుకోగలరు’ అన్నాడు. ఆలాగే శ్రవణకుమారుని తల్లిదండ్రులు దశరథుని శపించి ఆపై దేవలోకం చేరుకొన్నారు. తల్లిదండ్రుల సేవనవల్ల ఉత్తమలోకప్రాప్తి అనడం గుర్తుంచుకోదగ్గది.

సత్యవతి సంప్రార్థన :

పరాశరునికి సత్యవతికి జనించినవాడు వ్యాసుడు. వేదవిభాగం చేసిన వేదవ్యాసుడు 18 పురాణాలు, మహాభారత ఇతిహాసాన్ని రచించినవాడు. తల్లి పట్ల గౌరవం కలవాడు.

సద్యో గర్భంబున నహి
మద్యుతి తేజుండు వేదమయుఁ డఖిలమునీం
ద్రాద్యుడుఁ వేదవ్యాసుం
డుద్యత్ జ్ఞానంబు తోడ నుదితుండయ్యెన్.

'మీకుం బనిగల యప్పుడ నన్నుం దలంచునది. ఆ క్షణంబ వత్తు' అని వాగ్దానం చేసి అదే మేరకు పలుమారులు ప్రత్యక్షమయినవాడు. విచిత్రవీర, చిత్రాంగదులు మరణించినా వంశచ్ఛేదం కాకూడదని సత్యవతి వ్యాసుని ప్రార్థించింది. తనకిష్టం లేకపోయినా తల్లి కోరిక తీర్చాడు. దేవరన్యాయంతో ధృతరాష్ట్ర, పాండురాజులు జన్మించారు. ఆలాగే భీష్ముడు సత్యవతి మాటలకు కట్టుపడి అంపశయ్యపై వాలేదాక కౌరవుల పక్షంలోనే మెలగినాడు.

కుంతి వాత్సల్యం

మహాభారతంలో సంతానం కోసం అనేకరకాలయిన బాధలు పడ్డది కుంతి. బాల్యచాపల్యంతో దుర్వాసుడిచ్చిన మంత్రం పరీక్షించాలని భావించి కన్యాత్వదశలోనే 'తల్లి' అయింది. కొడుకును గంగపాలు చేసింది. కుమారాస్త్రవిద్యా ప్రదర్శనవేళ 'రాధేయుని' గుర్తించినా మనసులో మమత దాచుకొని మూర్ఛపోయింది.

కర్ణునితో తాను తల్లినని ఆ తరువాత విశదం చేసింది. ధర్మరాజాదులతో స్నేహం చేయమని చివరకు పాండవుల కోసం 'వరం' కోరింది. కర్ణుడు తల్లితో అర్జునుడు తప్ప మరి మిగిలినవారు చిక్కినా తాను చంపనని వాగ్దానం చేశాడు. భారత సన్నివేశాలతో కర్ణుని తూలనాడుతుంటే ఎంతగా కుమిలి పోయిందో. చివరకు సంగ్రామానంతరం ధర్మరాజు చేత 'తిలాంజలి' సమర్పించేలా చేసి శాపగ్రస్తురాలయింది. ఈ సన్నివేశంలో తల్లి ఆవేదన గ్రహించడమే ప్రధాన ప్రయోజనం.

మాద్రి కారణంగా పాండురాజు మరణిస్తే ఆ మాద్రి సంతానానికి

తానే తల్లి అయింది. సంతానం కనడంలోనూ పాండురాజు ఆశలే శిరోధార్యమయింది. లాక్షాగృహ దహనానంతరం పాండవులు అరణ్య మార్గంలో వెళుతుంటే 'హిడింబాసురుని' బాధ ఎదుర్కోవలసి వచ్చింది. హిడింబ భీముని వలచింది. కుంతికిది విషమప్రశ్న. అసహాయత ఒకవైపు రక్షణావసరం మరోవైపు. అందుకే భీమునితో 'ఈమె దివ్యవనిత, పరమసాధ్వి. ఈమె సంతానం వల్ల పాండురాజు వంశానికి అభ్యుదయం' అంది. సంతాన పర్యంతం హిడింబను ఏలుకొంటానన్నాడు భీముడు. ఘటోత్కచుడు జన్మించాడు. అతని వల్ల మేలే జరిగింది. కుంతి దూరదృష్టికి ఇదొక ఉదాహరణ.

ఏకచక్రపురంలో పాండవులు విప్రాకారులయ్యారు. గ్రామమంతట తిరిగి భిక్షాన్నం తెచ్చేవారు. కుంతి రెండుభాగాలు చేసి ఒక భాగం భీమునికి పెట్టడంలో 'కడుపారని పెట్టు కన్న తల్లి' అనడం సార్థకమయింది. ఆలాగే బకాసురునికి ఆహారంగా భీముని పంపాలను కొనప్పుడు ధర్మరాజు అడ్డుతగిలాడు. అయినా బ్రాహ్మణునితో 'నాకేవురు కొడుకులు. వారిలో ఒకరిని పంపుతాను. అతడు మంత్రసిద్ధుడు. రాక్షసుని వధిస్తా'డని భరోసా ఇచ్చి విప్రవనిత ఆవేదన తీర్చింది. ఒక తల్లి కుమారుని సాయంతో గ్రామానికి పట్టిన పీడ వదిలించడం గుర్తించదగ్గ అంశం.

అర్జునుడు మత్స్యయంత్రచ్ఛేదనం చేశాడు. ద్రౌపది అర్జునునే పెళ్లాడాలి. కాని ధర్మరాజు తల్లితో 'మే మొక్క భిక్ష తెచ్చితిమి' అన్నాడు. కుంతి 'ఏవురు పంచుకొనుడు' అంది. ఇది కూడా తల్లికొక విషమపరీక్ష. వ్యాసాగమనంతో ఈ వివాదం పరిష్కృతమయింది.

కుంతికి మాద్రీసుతులపై గల 'పెంచిన మమకారం'కూడా విశిష్టమే. అరణ్యానికి పాండవులు కదిలేవేళ కుంతి ద్రౌపతితో ప్రత్యేకంగా సహదేవుని గూర్చి

'కడు పసిబిడ్డ వీడొకటి కాదవునా నెఱుంగడు ముందరె
య్యెడ నొక పాటెఱుంగ డెదయంతయుఁ గోమలమెప్పుడైనన్ఁ

గుడువంగఁ బిల్తుగాని తనకుం గల యాకటి ప్రొద్దెఱింగండీ
కొడుకిటు పోకకు న్మనము గుండెడు నిన్గని యూఅడిల్లెడున్'

అంది. అంతేకాదు అరణ్యవాసం అవశ్యకర్తవ్యమయినా కుంతి ద్రౌపదితో 'నిను నమ్మి చాల విషమంబగు నివ్వనవాస మీతడుం బూనఁగ నియ్యకొంటి' అన్నది. శ్రీకృష్ణరక్షణ పాండవులకు సమకూరేదాక కుంతి చాలా శ్రమించింది. తదనంతరం గాంధారీ ధృతరాష్ట్రుల సేవనంలో గడిపి ధన్యురాలయింది. అరణ్యంలో విస్తరించిన కార్చిచ్చునుండి తప్పించుకోలేక దగ్ధురాలయింది.

గాంధారి మాతృత్వ ఆవేదన

గాంధారి నూరుగురు బిడ్డల తల్లి. తనమాట వినని దుర్యోధనాదులంటే గాంధారికి సుతరామూ ఇష్టం లేదు. కురుక్షేత్ర సంగ్రామం మొదలు కావడానికి ముందు దుర్యోధనుడు గాంధారి దగ్గరికి వచ్చి నమస్కరించాడు. గాంధారి గుండెరాయి చేసుకొని 'ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడే జయమని" చెప్పింది. కృష్ణుడందుకే ఆమెను ధర్మశీలిగా కీర్తించాడు. అయినా స్త్రీ పర్వంలో గాంధారి తన్ను తాను సంబాళించు కోకపోయింది. భీముని చూచి కౌరవుల్ని చంపేవేళ అంధులం, వృద్ధులం, రాజ్యభ్రష్టులం మేము గుర్తుకు రాలేదా?అని పలకరించింది. కొమ్మలు తునిమిన మోడులాగ ఉన్నానని ధృతరాష్ట్రుడు అన్నాడు.

ఇతరుల శోకం కంటె తల్లి శోకం, కోపం, తీవ్రతరం. అందుకే కళ్ళకు కట్టిన అంచుసందులోనుంచి గాంధారి ధర్మరాజు పాదాలు చూసేసరికి కరికాలుడయ్యాడు ధర్మరాజు. వీటన్నిటికి కృష్ణుడే కారణమని శపించింది. కన్నతల్లి మమకారం ఎవరనయినా పట్టించుకోలేదు. తల్లి మాటలు విన్న పాండవులు బాగుపడితే, తల్లి మాటలు పెడచెవినిబెట్టిన కౌరవులు నశించారు.

భాగవత కథలు – భక్త ధ్రువుడు

మూలం
శ్రీరామచంద్రడోంగరే మహరాజ్
అనువాదం :
శ్రీ స్వామి విద్యాస్వరూపానన్ద

(గత సంచిక తరువాయి)

బృందావనము ప్రేమభూమి. అచట వుంటూ భజన చేయడం వలన మనస్సు త్వరగా శుద్ధమవుతుంది. బృందావనము దివ్యభూమి. అచట జీవేశ్వరుల కలయిక త్వరగా కలుగుతుంది.

ధ్రువుడడిగాడు – బృందావనానికి వెళ్ళి అచట పరమాత్మారాధన ఎలా (ఏ విధంగా) చేయాలి ? నారదుడు చెప్పాడు – ధ్యానం చేసే ముందు మానసిక సేవ చేయాలి. చతుర్భుజ నారాయణునికి మానసిక సేవ చేయాలి. ఆ సమయంలో మనోధార (నారాయణునికి సంబంధించిన చింతనాధార) తెగిపోకుండా (మధ్యలో దీన్ని వదలి ఇతర ఆలోచనలు రాకుండా) చూచుకోవాలి. ఈశ్వరునియందు మనస్సు ఎల్లప్పుడూ సంలగ్నం కావాలి. మానసిక సేవ శ్రేష్ఠమైనదిగా అంగీకరించబడినది. శంకర భగవత్పాదాచార్యులు కూడా కృష్ణుని మానసికసేవ చేయుచుండిరి.

ఎవరు తమ వద్ద ఏమీ వుంచుకోరో అట్టి విరక్త సంన్యాసులు మానసిక సేవ చేయాలి. అది ఉత్తమము. కానీ గృహస్థుడు కేవలం మానసిక సేవ మాత్రం చేయడంచే ఏమీ లాభం వుండదు. గృహస్థుడు మానసిక సేవ మఱియు ప్రత్యక్ష సేవ రెండూ చేయాలి. (మానసిక పూజ, బాహ్య పూజ రెండూ చేయాలి).

మానసిక సేవ (పూజ) చేయడానికి ఉత్తమ సమయం ప్రాతః కాలం నాల్గుగంటల నుండి అయిదున్నర గంటల వరకు.ఎవరి ముఖమూ చూడకుండా దైవసేవ (దైవచింతన) చేయాలి. ఉదయమే (4గంటలకు) నిద్రలేచి నీవు గంగాతీరంలో కూర్చొని ఉన్నట్లు మనస్సులో ధ్యానంచై. మనస్సులోనే గంగలో స్నానం చై. భగవంతుని అభిషేకానికై (స్నానానంతరం) వెండికలశంతో గంగాజలాన్ని (మనస్సులోనే) తీసుకరా.భగవంతుడు కృష్ణుడు నిద్రలేవగనే ఆయనచే ఆచమన చేయించు. నైవేద్యానికి వెన్న, చక్కెరల అవసరం కల్గుతుంది. భోలేనాథుడు ఈశ్వరునికి అభిషేకం తప్ప ఏమీ అవసరం లేదు. కానీ కన్నయ్య

అన్నీ కోరుతాడు. ఆచమనం తరువాత కృష్ణుని (గంగాజలంతో) స్నానం (మనస్సులోనే) చేయించు. శంకరుడు చల్లటి నీటితో స్నానం చేస్తాడు. కానీ బాల కృష్ణునికి వేడినీటితోనే స్నానం చేయించు. స్నానానంతరం ఠాకూరుకు అలంకారంచై. అలంకరించకపోయినా కృష్ణుడు సుందరంగానే కనిపిస్తాడు. కానీ (బాలకృష్ణునికి) అలంకారం చేయడం వలన నీ మనస్సు కూడా సుందరమవుతుంది. నీ వికార మనస్సును బాగుపఱచడానికే (భగవంతునికి) అలంకారంచేయడము. భగవంతునికి అలంకారం చేయడంవలన సమాధివంటి ఆనందం కలుగుతుంది. అలంకారానంతరము భగవంతునికి తిలకం దిద్దు. ఇంపైన నైవేద్యం పెట్టు (నివేదించు),హారతి ఇవ్వు. ఆ సమయంలో నీ హృదయం ఆర్ద్రం కావాలి. పద్మపురాణంలో హారతిక్రమం చెప్పబడింది. పాదాలు, తొడలు, (పాదపైభాగం), వక్షస్థలం, ముఖం, ఆ తరువాత అన్ని అంగాలకు (శరీరమంతటికీ) హారతివ్వాలి. హారాతిచ్చేప్పుడు ప్రభు దర్శనం కోసం ఆర్తుడు కావాలి.

భగవంతుని చూస్తూ (దర్శిస్తూ) ఆయన ధ్యానం చేయాలి. ధీర మనస్సుతో శ్రీహరిధ్యానంచై. జపం ధ్యానంతో కూడి వుండాలి. కొందరు జపం చేస్తూ కుటుంబ, ప్రపంచ ఆలోచనలు చేస్తూంటారు. అలా చేయడం వలన జపం నిష్ఫలంగా అంగీకరింపబడదు. కానీ ఆ జపంచే ఏ ఫలం – లాభం కలుగాలో అట్టి ఫలం కలుగదు (లభించదు). స్నానం చేయడం వలన శరీరం శుద్ధమవుతుంది. దానం చేయడంవలన ధనం శుద్ధమవుతుంది. ధ్యానం చేయడంవలన మనస్సు శుద్ధమవుతుంది.

జపము మఱియు ధ్యానము ఒకటిగా చేయాలి. జపం చేసేటప్పుడు ఏ దేవతను నీవు ధ్యానం చేస్తున్నావో ఆ దేవతా మూర్తి (రూపం) నీ మనస్సునుండి తొలగరాదు. నాలుకతో భగవంతుని నామాన్ని మనస్సుతో భగవంతుణ్ణి స్మరిస్తూండాలి. కళ్లతో ఆయనను దర్శించు. చెవులతో ఆయనను గురించి వింటూండు.

నేను నీకు (ధ్రువునికి) “ ఓం నమః భగవతే వాసుదేవాయ” అను ఒక మంత్రాన్ని ఇస్తున్నాను. ఈ మహామంత్రాన్ని నీవు ఎల్లప్పుడు జపిస్తూండు. భగవంతుడు (దీనివలన) తప్పక ప్రసన్నుడవుతాడు. నా ఆశీర్వాదం నీకుంది. భగవంతుడు ఆరు నెలలకు నీకు లభిస్తాడు.

సంచిత, ప్రారబ్ధకర్మను కాల్చేయడానికి మూడు జన్మలను ఎత్తాల్సి

వుంటుంది. భగవద్గీతలో భగవంతుడు చెప్పాడు. – అనేక జన్మల తరువాత జీవుడు నన్ను పొందుతాడు “బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే’ అని. విద్వాంసులు జన్మలనే దానికి మూడు జన్మలని అర్థం తెలిపారు. తమ కర్మక్షయంకోసరం జ్ఞానులు – యోగులు మూడు జన్మలు ఎత్తవలసి వుంటుది. కానీ భాగవతంలోని ధ్రువచరిత్రలో భగవన్నామజపం చేయడంవలన ఆరు నెలలలోనే భగవంతుడు లభిస్తాడు – అని చెప్పబడింది. “మాసైరహం షడ్భిరముష్యపాదయో ర్ఛాయాముపేత్యాపగతః ।” – ధ్రువుడంటున్నాడు భగవంతుని చరణ పాద ఛాయను నేను ఆరు నెలలలోనే పొందాను” – అని

ఇది నిజమైన మాట. నీవు కూడ (సాధన చేసి) అనుభవించి చూడు. కానీ ధ్రువుడేవిధంగా తపస్సు చేశాడో ఆ విధంగా తపస్సుచై. సాధన చేయడం వలన సిద్ధి లభిస్తుంది. ధ్రువుడనేక జన్మలు తపస్సు చేశాడు. పూర్వ జన్మలో ఇక ఆరు నెలలో ఆయనకు పరమాత్మ దర్శనం కలుగనుండినది. భగవద్దర్శనానికి అతనికి (గత జన్మలో) ఇక ఆరునెలలు బాకీ వుండినది. అతను (గత జన్మలో) ధ్యానం చేస్తూండినాడు అచటికి రాజు – రాణి వచ్చారు. వారిని చూచిన ధ్రువుని మనస్సులో ఈ రాజు రాణి ఏ సుఖాలననుభవిస్తున్నారో అలా నేనెపుడు అనుభవించలేదు – అని ఆలోచించసాగాడు. అంచేత (అతనికి భగవద్దర్శనం కలుగకపోగా) ఈ జన్మలో రాజు ఇంటిలో జన్మించాడు.

నారదుడిపుడు రాజు ఉత్తానపాదుని దగ్గఱకు పోయాడు. వియోగంలో అందరికి తమనుండి విడిపోయి ఎదురుగాలేని వ్యక్తుల గుణాలు జ్ఞాపకానికి వస్తాయి. ఉత్తానపాదుడు ధ్రువుని గుణాలను జ్ఞాపకం చేసుకొంటూ (ధ్రువుని పట్ల తన ప్రవర్తనను గుర్తుకు తెచ్చుకొని) పశ్చాత్తాపపడుతూ కూర్చొని యుండినాడు.

నారదుడు ఆలోచించాడు. ఏమైనా కానీ అతడు నా శిష్యుని తండ్రి, నేనాతనిని ఉద్ధరించాలి. ఇతడు సురుచికి అధీనుడైనాడు. ఇతడు నాలుకను వశం చేసుకొంటే అతని సాధన సఫలమవుతుంది. నాలుకపై (వాక్కుపై) నియంత్రణ వుంటే సురుచిమోహం తగ్గిపోతుంది – అని.

ఉత్తాన పాదునితో నారదుడన్నాడు – నీవు ఆరునెలలు కేవలం పాలు మాత్రం త్రాగు. జపానుష్ఠానం చై అని. **(సశేషం)**

నామసంకీర్తన

శుద్ధబ్రహ్మ పరాత్పర రామ
కాలాత్మక పరమేశ్వర రామ
శ్రీమద్దశరథ నన్దన రామ
కౌసల్యా సుఖ వర్ధన రామ
గౌతమ ముని సంపూజిత రామ
సురమునివర గణ సంస్తుత రామ
భార్గవదర్ప వినాశక రామ
శ్రీమదయోధ్యా పాలక రామ
అగణిత గుణ గణ భూషిత రామ
హనుమత్సేవిత నిజపదరామ
సాకేతపురీ భూషణ రామ
సమస్త జన సమ్మానిత రామ
సకల జీవ సంరక్షక రామ
సమస్త లోకాధారక రామ
ఆగత మునిగణ సంస్తుత రామా
రామ రామ జయ రాజా రామ
రామ రామ జయ సీతా రామ
జయ జయ మఙ్గళ సీతా రామ
మఙ్గళకర జయ మఙ్గళ రామ
సఙ్గత శుభ విభవోదయ రామ
ఆనన్దామృత వర్షక రామ
ఆశ్రితవత్సల జయ జయ రామ
రఘుపతి రాఘవ రాజారామ !
పతితపావన సీతారామ

రామాయణంలో భరతుడు

– శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

లక్ష్మణునకువలె భరతునకు కూడ శ్రీరాముని యెడల అనన్యభక్తి కలదు. అతని సౌభ్రాతృత్వము, అపూర్వ ధర్మనిష్ఠ రామాయణమునందు సముచిత స్థాన మాతనికి సంపాదించి పెట్టినవి. ఆదర్శవంతమగు అతని ప్రగాఢ సోదరప్రేమ జనులకు మార్గదర్శకమై అలరారుచున్నది. చేతికి వచ్చిన రాజ్యమును ఎవరైన వదలుకొందురా ? అప్రయత్నముగ లభించిన భోగభాగ్యములను, సిరిసంపదలను లోకాధిపత్యమును ఎవరైన పరిత్యజించగలరా ? భరతుడట్లు పరిత్యజించెను. అతని త్యాగము పరమ ఉదారమైనది. మహోన్నతమైనది. అది అభావ వైరాగ్యముకాదు. ధర్మము కొఱకు, సత్యముకొఱకు, న్యాయముకొఱకు చేసిన మహాత్యాగమది.

భరతునకు శ్రీరామునియందుగల ప్రేమ, గౌరవము, భక్తి ప్రపత్తులు అసామాన్యమైనవి. కనుకనే ఎందఱు చెప్పినప్పటికిని వినక అన్నగారిని అరణ్యమునుండి వెనుకకు తెచ్చెదనని భీష్మించి కాననములకు బయలుదేఱెను. భరతుని సద్గుణములను వర్ణించుచు దశరథుడు శ్రీరామునకీ ప్రకారము తెలిపెను –

కామం ఖలు సతాం వృత్తే భ్రాతా తే భరతః స్థితః ।
జ్యేష్ఠానువర్తీ ధర్మాత్మా సానుక్రోశో జితేంద్రియః ॥

‘ నీ సోదరుడగు భరతుడు సజ్జనులయొక్క ఆచార విచారములు కలవాడును, తన జ్యేష్ఠ సోదరుని అనుసరించువాడును, ధర్మాత్ముడును, దయాళువును, జితేంద్రియుడును అయియున్నాడు. ఇందు సందేహము లేదు. దశరథుని ఈ వచనములచే భరతుని గుణగణములు చక్కగ విశదమగుచున్నవి.

భరతుడు మేనమామ యింటినుండి అయోధ్యకురాగానే తల్లియగు కైకేయి జరిగిన వృత్తాంతమంతయు అతనికి తేలియజేసి రాజ్యమును

స్వీకరింపుమని చెప్పగా భరతుడు తల్లిని తీవ్రముగ మందలించి, ఆమె యొక్క చేష్టలను నిరసించి యిట్లు చెప్పెను -- శ్రీరాముడు ధర్మాత్ముడు. ఈ వంశమున అందఱి కంటె పెద్దవానికే రాజ్యాభిషేకము జరుగును. చిన్నవాడు జాగ్రత్తగ పెద్దవాని ఆజ్ఞలకు అధీనుడై కార్యమాచరించును. నీ అభిలాషను నేను ఎన్నడును పూర్తి చేయను. శ్రీరాముని తిరిగికొనివచ్చి ఆ మహాత్ముని దాసుడనై హాయిగ జీవితమును గడిపెదను. వారి బదులు నేనే పదునాలుగు వత్సరములు వనమందు నివసించెదను. భరతుని ఈ వాక్యములు అతని భ్రాతృభక్తిని, త్యాగశీలత్వమును, ధర్మనిరతిని స్ఫురింపజేయుచున్నవి.

మంథరవలననే శ్రీరామునకు వనవాసమను కష్టము సంభవించినదని యెఱింగి శత్రుఘ్నుడు మంథరను దండించదలంచి నపుడు భరతుడు అడ్డుపడి -

అవధ్యాః సర్వభూతానాం ప్రమదాః క్షమ్యతామితి ।

‘ క్షమించుము. ప్రాణులందఱికిని స్త్రీలు వధింపరానివారు అయియున్నారు.’ అని చెప్పి విడిపింపజేసెను. ఈ సంఘటన ద్వారా భరతుని దయార్ద్రహృదయముయొక్క పరిచయము గలుగుచున్నది. గుహుడు భరతుని ఉదాత్త స్వభావమును తెలిసికొని అతనితో నిట్లు పలికెను -

ధన్యస్త్వం న త్వయా తుల్యం పశ్యామి జగతీతలే ।
అయత్నాదాగతం రాజ్యం యస్త్వం త్యక్తుమిహేచ్ఛసి ॥

‘మీరు ధన్యులు. ఏలయనగా, అప్రయత్నముగ చేతికి వచ్చిన రాజ్యమును మీరు త్యజించ దలంచుచున్నారు. మీవంటి ధర్మాత్ముడు ఈ భూమండలమున మఱియొకడెవడును కానిపించుటలేదు’ గుహుడు భరతునియొక్క మహత్తర త్యాగశీలతను గుర్తెఱింగి అతనిని లెస్సగ సంస్తుతించెను.

ఇక భరద్వాజుడున్ను భరతుని విశాల హృదయమును కనిపెట్టి ‘నీ యందు గురుజనుల సేవ. ఇంద్రియ నిగ్రహము, మహాత్ముల

ననుసరించుట- అను ఈధర్మములుండుట సహజమేయగును-అని పలికెను.

నైతచ్చిత్రం నరవ్యాఘ్రే శీలవృత్తవిదాం వరే ।
యదార్యం త్వయి తిష్ఠేత్తు నిమ్నోత్సృష్టమివోదకమ్ ॥

‘నీవు మనుజులలో శ్రేష్ఠుడవు. శీలసదాచారముల నెఱిఁగిన వారిలో ఉత్తముడవు. పల్లపునేలయందు అన్నివైపుల నుండి ప్రవహించు జలమువలె నీయందు శ్రేష్ఠగుణములన్నియు వచ్చి చేరినవి. ఇందు ఆశ్చర్యమేమియు లేదు.’

చిత్రకూటమున భరతుని ఆగమన సందర్భమున లక్ష్మణుడు కోపావేశముతో భరతునిగూర్చి వచించిన వాక్యములను విని అతనిని శాంతపఱచుచు శ్రీరాముడు చెప్పిన ఈక్రింది మాటలు భరతుని మహోన్నత చరిత్రను వ్యక్తము చేయుచున్నవి.

‘లక్ష్మణా ! భరతుడు గొప్ప భ్రాతృవత్సలుడు. అతడు నాకు ప్రాణములకంటెను అధిక ప్రియుడు. (ప్రాణైః ప్రియతరః) స్నేహ యుక్తమగు హృదయముతో అతడు మనలను కలిసికొనుటకై వచ్చియుండవచ్చును. భరతుడు వచ్చిన పిదప నీవు అతనితో కఠోరవాక్యమునుగాని, అప్రియవచనమునుగాని పలుకవద్దు. అతనితో నీవేదైన ప్రతికూలవాక్యమును పలికినచో అది నాతో పలికినట్లే యెంచబడగలదు !

అచట నీతిజ్ఞుడగు భరతుడు -

“ధర్మం పురస్కృత్య విధూయ దర్పమ్ ”

‘ధర్మమును ఎదురుగా పెట్టుకొని గర్వమును వదిలి, శ్రీరాముని ప్రసన్నునిగ జేయుటకై తన వెంట తెచ్చిన సైన్యమును చిత్రకూటసమీపముననే ఉంచి తాను సోదరుని దర్శనమునకై బయలుదేరెను.’ ‘ధర్మమును ముందుంచుకొని గర్వమును పరిత్యజించి’ అను పదములద్వారా వాల్మీకి భరతుని మహోన్నత స్వభావము యొక్క

యథార్థ చిత్రణమును గావించెను.

'శ్రీరాముని, సీతను, లక్ష్మణుని చూడనంతవఱకు నాకు శాంతి లభించదు' – అని ఆ సమయమున భరతుడు శత్రుఘ్నునితో పలికిన పలుకులుకూడ అతని సౌభ్రాతృత్వమును బాగుగ వెల్లడిచేయుచున్నవి. చిత్రకూటమున పర్ణశాలయందు శ్రీరామునకు భక్తిపూర్వకముగ ప్రణమిల్లి భరతుడు రాజ్యాధిపత్యమును స్వీకరింపుమని అన్నగారిని ఎన్ని విధములుగనో, ఎన్ని పర్యాయములో అడిగి చూచెను. కాని శ్రీరాముడు పితృవాక్యపరిపాలనను దృష్టియందుంచుకొని తన సత్యప్రతిజ్ఞనుండి ఇసుమంతైనను చలింపలేదు. చిట్టచివఱకు శ్రీరాముని పాదస్పర్శతో కూడిన పాదకలను గైకొని వానినే శ్రీరామప్రతినిధిగ భావించి భక్తి పురస్సరముగ గొనిపోయి పూజించుచు, ఆ పదునాల్గువత్సరములును తాపస వేషముతో, వ్రత నియమములతో శ్రీరాముని నిరంతరస్మరణతో కాలము గడుపుచు, శ్రీరాముని రాకకై వేయికండ్లతో నిరీక్షించుచుండెను.

పదునాలుగు వత్సరముల గడువుకాలము పూర్తికాగానే శ్రీరాముడు తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొని, దుష్టులగు రాక్షసులను సంహరించి, ఋషులకు ఆనందమొనగూర్చి పుష్పక విమానములో అయోధ్యకు తిరిగివచ్చుచు ముందుగా గుహునకు, భరతునకు, అయోధ్యవాసులకు తన రాకనుగూర్చి తెలియజేయుటకై హనుమంతుని పంపెను. శ్రీరాముని రాకనుగూర్చి వర్తమానము హనుమంతుని ముఖతః వినగనే భరతునకు కలిగిన ఆనందమునకు పట్టపగ్గములు లేకపోయెను.

ఏతి జీవన్తమానన్దో నరం వర్షశతాదపి ।

"బ్రతికియున్నచో నూఱుసంవత్సరములైన పిదపకూడ మనుజునకు ఆనందము లభించును" అను ఆర్యోక్తి నిజమని నేడు నాకు తెలియుచున్నది – అని భరతుడు తన ఆనందానుభవమును వ్యక్తమొనర్చెను.

శ్రీరాముడు మొదట రాజసూయయాగము చేయ దలపెట్టినను

ఆ యజ్ఞమందు రాజవంశముల వినాశము, సంహారము కలుగగలదు. కావున దానిని విరమించి అశ్వమేధయాగము నొనర్చిన బాగుండునని భరతుడు సూచించగా శ్రీరాముడు చాలసంతసించి, భరతుని ధర్మసంగతమైన వచనములను ఆమోదించి రాజసూయయజ్ఞ సంకల్పమును విరమించి అశ్వమేధయాగమును చేయుటకు నిశ్చయించెను. ఆ సందర్భమున శ్రీరాముడు –

లోకపీడాకరం కార్యం న కర్తవ్యం విచక్షణైః ।

బాలానాం తు శుభం వాక్యం గ్రాహ్యం లక్ష్మణపూర్వజ ॥

' భరతుడా ! విజ్ఞులగువారు జనులకు బాధాకరమైన కార్యమును చేయరాదు. చిన్నవారు చెప్పినను మంచివాక్యములైనచో తప్పక వానిని స్వీకరించవలెను'– అని చెప్పి భరతుని విజ్ఞతను ప్రశంసించెను.

చివఱకు శ్రీరాముని సాకేతగమనసమయమున శ్రీరాముడు భరతునకు రాజపదమున అభిషేకము చేయదలంచగా ఆ విషయము తెలిసికొని భరతుడు తన అగ్రజునితో చెప్పిన ఈ క్రిందిమాటలు అతని అపారభ్రాతృభక్తిని సూచించుచున్నవి.

సత్యేనాహం శపే రాజన్ స్వర్గభోగేన చైవ హి ।

న కామయే యథా రాజ్యం త్వాం వినా రఘునన్దన ॥

'రాజా ! రఘునందనా ! నేను సత్యముపై ఒట్టుపెట్టుకొని చెప్పు చున్నాను – మీరు తప్ప నాకు ఇతరమైన ఏదియువద్దు, రాజ్యముగాని, స్వర్గభోగములుగాని నాకు వలదు.' భరతుని ఆ వాక్యములను విని శ్రీరాముడు కుశలవులకు రాజ్యమొప్పగించి మహాప్రస్థానమున భరతునిగూడ తనవెంట తీసికొనివెళ్ళెను.

భరతునకు శ్రీరామునియెడల ఎంత భక్తిభావముకలదో, శ్రీరామునకు భరతునియెడల అంతవాత్సల్యము కలదు. చిత్రకూటమున పురజనులతో శ్రీరాముడు భరతునిగూర్చి యిట్లు చెప్పెను.

జానామి భరతం క్షాన్తం గురుసత్కారకారిణమ్ ।

సర్వమేవాత్ర కల్యాణం సత్యసన్ధే మహాత్మని ॥

‘భరతుని నేనెఱుగుదును. అతడు మహాక్షమాశీలుడు. గురువుల యెడలాదరము కలవాడు. సత్యసంధుడు. మహాత్ముడు. అతనికి అంతయు మంగళకరముగనే పరిణమించగలదు.’ అట్లే పంచవటియందు శ్రీరాముడు లక్ష్మణునితో భరతునిగూర్చి ఈ ప్రకారముగ సంస్తుతించెను –

‘లక్ష్మణా ! భరతునియొక్క ఆ ప్రియ, మధుర, మనోహర, అమృతసమాన, హృదయాహ్లాదకర వాక్యములు నాకు జ్ఞప్తికి వచ్చుచున్నవి. ఆహా ! మహాత్ముడగు భరతునితోను, మహావీరుడగు శత్రుఘ్నునితోను కలిసికొను ఆ దినమెపుడు వచ్చునో ! భరతుని యొక్క స్నేహముచే నా హృదయము సంతప్తమగుచున్నది’ శ్రీరాముని వాక్యములద్వారా భరతునియొక్క అమోఘదివ్యచరిత్రము, పవిత్ర ఉదార హృదయము సువ్యక్తమగుచున్నవి.

కనుకనే వాల్మీకి ‘ఆకాశ ఇవ నిర్మలః ’–భరతుని హృదయము ఆకాశము వలె నిర్మలమైనది. అని వక్కాణించెను. ఈ ప్రకారముగ భరతుని సౌభ్రాతృత్వము, త్యాగశీలత, ధర్మనిష్ఠ అపూర్వమైనవి, మానవాళికే ఆదర్శవంతములైనవి.

తెలంగాణా – నిర్మల జిల్లాలో శ్రీ శుకబ్రహ్మాశ్రమాధిపతులు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారి ప్రవచన కార్యక్రమాలు.

1). మార్చి 10,11 తేదీలలో నిర్మలమండలం వెంకటాపూర్‌లోని శ్రీవిద్యాప్రకాశానంద బ్రహ్మనిష్ఠాశ్రమ వార్షికోత్సవంలో ప్రవచనం.

2). మార్చి 12,13,14 తేదీలలో నిర్మలజిల్లా బీరవెల్లి గ్రామంలోని శ్రీవిద్యాప్రకాశానందగీతాశ్రమ వార్షికోత్సవంలో ప్రవచన.

3). మార్చి 15,16 తేదీలలో నిర్మలజిల్లా జినర్సాపూర్‌లోని శ్రీ విద్యాప్రకాశానంద గీతా సమాజ వార్షికోత్సవంలో ప్రవచన చేస్తారు. ఈ మూడు కార్యక్రమాలలో తెనాలి అష్టలక్ష్మీ పీఠాధిపతులు పూజ్యశ్రీ దండి నిర్మలానందస్వాములవారు, శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠ ఉత్తరాధికారి పూజ్యశ్రీ సంపూర్ణానందస్వాములవారు కూడ పాల్గొందురు.

Statement of Ownership and other Particulars of Vedantha Bheri (FORM IV See Rule 8)

01. Place of Publication	:	Srikalahasti
02. Periodicity of its Publications:		Monthly
03. Printer's Name	:	B.Viswa Natha Raju
Whether Citizen of India ?	:	Yes
Address	:	C.N.PRINTERS, Prakasam Road, TIRUPATI
04. Publisher's Name	:	Vidyaswarupanandagiri Swamy
Whether Citizen of India ?	:	Yes
Address	:	Sri Sukabrahma Asramam Swami Vidyaprakasananda Nagar, Sri Sukabrahma Ashram (P.O.) SRIKALAHASTI - 517640
05. Editors Name	:	Vidyaswarupanandagiri Swamy
Whether Citizen of India ?	:	Yes
Address	:	Sri Sukabrahma Asramam Swami Vidyaprakasananda Nagar, Sri Sukabrahma Ashram (P.O.) SRIKALAHASTI - 517640
06. Name and Address of Indiduals : Who own the News Paper Partners of Share holders holding more than one percent of the total Capital		Vidyaswarupanandagiri Swamy Sri Sukabrahma Ashram Spiritual Institution Srikalahasti - 517640 Chittoor District A.P.

I Vidyaswarupanandagiri Swamy hereby declare that the particulars give above are true to the best of my knowledge and belief.

Date : 2nd March 2018 **(Sd/-) Vidya Swarupanandagiri Swamy**
Signature of the Publisher

శ్రీ మదాంధ్ర మహా భాగవతము

– ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

విష్ణుభక్తితో అభిమన్యు కుమారుడు కామక్రోధాది అరిషడ్వార్గాన్ని జయించి కరుణార్ద్ర హృదయుడయ్యాడు. సామర్థ్యం ఉన్నప్పటికీ శృంగిని శపించలేదు. ఏడవనాడు తక్షకుడి వల్ల తనకు మరణం తప్పదని పరీక్షిత్తు నిశ్చయించుకున్నాడు. నిరాహారుడై ప్రాణపరిత్యాగం చేయాలనుకున్నాడు. ఇహలోక భోగాలు, స్వర్గలోక సుఖాలు నిరుపయోగాలుగా అతనికి తోచాయి. గంగాతీరానికి వెళ్ళి విష్ణుధ్యానంలో కూర్చున్నాడు. ఈవార్త అంతటా వ్యాపించింది. అత్రి, విశ్వామిత్రుడు, మైత్రేయుడు, భృగువు, వసిష్ఠుడు, పరాశరుడు, చ్యవనుడు, భరద్వాజుడు, పరశురాముడు, దేవలుడు, పర్వతుడు, నారదుడు మొదలైన బ్రహ్మర్షులూ, దేవర్షులూ, రాజర్షులూ, అరుణుడు మొదలైన కాండర్షులూ ఇంకా వివిధ గోత్ర సంభవులైన మహర్షులు శిష్యప్రశిష్యులతో వచ్చారు. వచ్చిన వారందరినీ రాజు యథోచితంగా సత్కరించాడు. తాను వేటకు వెళ్ళి ముని మూపుమీద మృతసర్పాన్ని వేసిన సంగతి వారికి తెలియజేశాడు. తాను మహా పాపినన్నాడు. ఆ పాపాన్ని పోగొట్టమని ప్రాధేయపడ్డాడు. అహంకార పూరితుడై సంసారసాగరమగ్న మానసుడైన తనకు తక్షకుని విషాగ్ని మోక్షహేతువు కాగలదన్నాడు. ప్రతి జన్మలోనూ హరిచింతనాసక్తి, శ్రీకృష్ణకథాశ్రవణానురక్తి, శ్రీకృష్ణ పదభక్తి తనకు కలిగేవిధంగా అనుగ్రహించుమని కోరాడు. కుమారుడైన జనమేజయుణ్ణి రప్పించి రాజ్యభారాన్ని అతనికి అప్పగించాడు. కొసలు తూర్పుగా ఉండేలా వేసిన దర్భాసనం మీద కూర్చుని భగవద్ధ్యానైక చిత్తుడయ్యాడు. దేవతలు పూలవాన కురిపించారు. దేవదుందుభులు మ్రోగించారు. అక్కడున్న మునులంతా పరీక్షిత్తును ప్రశంసించారు. అతడు తన శరీరాన్ని విడిచి పెట్టేదాకా తామంతా అక్కడే ఉండదలచినట్టు చెప్పారు. పరీక్షిత్తు మళ్ళీ వారికి నమస్కరించాడు. తాను విష్ణులీలలు వినగోరుతున్నట్టు చెప్పాడు. ఏడు రోజుల్లో మోక్షం వచ్చేందుకు ఏం చేయాలో సెలవిమ్మని సర్వజ్ఞులైన మునులను పరీక్షిత్తు కోరాడు.

ఆ సమయంలోనే ఒక అవధూతమూర్తి అక్కడికి వచ్చాడు. అతడు ప్రతిక్షణమూ పరబ్రహ్మాన్ని దర్శిస్తూ ఉంటాడు. అందువల్ల పరిసరాలేవీ అతనికి తెలియవు. అతనిది పదహారేండ్ల సమ్మోహనాకారం. ఇవ్వని వారిని కోపంతో దూషించడు. ఎటువంటి కోరికలు కోరడు. వ్యర్థ విషయాల మీదకి మనసు పోనీయడు, లభించిన దానితో తృప్తిపడతాడు. ఏమీ తెలియని అమాయకుడిలా కనిపిస్తాడు. ఇది ఆయన స్వభావం. అతడే వేదవ్యాసమహర్షి కుమారుడు శుకమహర్షి. శుకమహర్షి అక్కడికి రాగానే తక్కిన మహర్షులంతా లేచి ఎదురువెళ్ళి స్వాగతం పలికారు. పాండవ పౌత్రుడైన పరీక్షిత్తు కూడా శుకమహర్షిని సముచితంగా అర్చించాడు. మళ్ళీ మళ్ళీ నమస్కరించాడు. విజ్ఞాన భూషణుడని వినుతించాడు. ఆ మహనీయుడక్కడికి రావడం తన అదృష్టమన్నాడు. అతని దర్శనం వల్ల తన జన్మ ధన్యమైందన్నాడు. ఆయన మాటలు వినడం, సేవలు చెయ్యడం వంటి వాటి ద్వారా మోక్షం లభించడం దుర్లభం కాదన్నాడు. 'మీరు అవధూతల్లో అగ్రగణ్యులు. గోవును పాలు పిదికేంత సమయం కూడా ఒకచోట నిలువరు. అలాంటి మీరు ఇలా వచ్చారంటే అది నా అదృష్టమే. మీ సందర్శనం వ్యర్థం కాదు. నా కోరిక తప్పక నెరవేరుతుంది. జీవులు నేడో రేపో శరీరాన్ని విడిచిపెట్టవలసిన వాళ్ళే. వాళ్ళు మోక్షం పొందేందుకు ఏమివినాలో, ఏమిచేయాలో, ఎటువంటిసేవలు నిర్వహించాలో, ఏ విధంగా ఆలోచించాలో విశదంగా నాకు తెలియజెయ్యండి. లోక గురుడవైన మీకు తెలియనిదంటూ ఏమీ ఉండదు. మహానుభావా! మోక్షమార్గాన్ని నాకు బోధించు'– అని పరీక్షిత్తు మహారాజు శుకమహర్షిని ప్రార్థించాడు.

ప్రథమ స్కంధం – సంపూర్ణమ్

శైవసిద్ధాంతము - శైవాగమాలు

- శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

(గత సంచిక తరువాయి)

శైవ సిద్ధాంతం వైదికయుగం (వేదకాలం) నుండే వుంది. ఇది భారతదేశ మందంతటా వుండినది. దీనికి హరప్పా, మొహంజొదారో త్రవ్వకాలలో చిక్కిన బహుముఖ శివుడు, యోగాసనశివుడు వగైరా అవశేషాలే సాక్ష్యం. కాలక్రమేణ ఆర్యుల ప్రాబల్యం వలన శైవ సిద్ధాంతం ఉత్తర భారతదేశాన్ని వదల దక్షిణ భారతదేశంలో విశేషంగా ప్రబలింది. తత్రాపి శుద్ధ ద్రావిడమైన అరవ - తమిళదేశంలో శైవసిద్ధాంతం పేరిట ఇది బాగా వ్యాప్తి చెందింది. కాబట్టే ఈ సిద్ధాంత ప్రతిపాదక గ్రంథాలు తమిళంలో బహుళంగా వున్నాయి. ఈశైవాగమాలు 28. వీని నామనిర్దేశం (పేర్లవివరణ) కంచియందలి శివాలయంలోని శాసనంలో వుంది.

ఈ శైవాగమంలో పాశుపతము, శైదసిద్ధాంతం, త్ర్యభిదర్శనం అనే మూడు శాఖ లున్నాయి. పాశుపతానికి నకులీశపాశుపతదర్శనం అని కూడ పేరు వుంది. ఈ పాశుపతానికి పాశుపత సూత్రములు మూలగ్రంథం,, దీనిరచయిత నకులీశుడు, దీనికి రాశీకరుడు వ్యాఖ్యానం వ్రాశాడు. ఈవ్యాఖ్యానానికి పంచార్థభాష్యం అని పేరు. ఇందు 1.కారణం, 2.కార్యం, 3.యోగం, 4.విధి, 5.దుఃఖాంతం అను పదార్థాలు నిరూపించబడ్డాయి. అంచేత దీనికి పంచార్థభాష్యం అనేపేరు వచ్చింది. పతి అంటే ఈశ్వరుడు, పశు అంటే జీవుడు - ప్రాణి, పాశము అంటే సంసారము - ప్రపంచము. ఈమూడింటి తత్త్వాన్వేషణే ఈ పాశుపతమందలి ప్రధానవిషయం. పశు,పతి,పాశం అనే మూడింటిని శైవసిద్ధాంతలో త్రికం అంటారు.

ఈశైవ సిద్ధాంతం 1.ప్రత్యక్షం, 2.అనుమానం, 3.శ్రుతి అనే మూడు ప్రమాణాలను అంగీకరిస్తుంది. ఇందు శ్రుతి అనే ప్రమాణంలో వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, ఇరవై ఎనిమిది శైవాగమాలు వస్తాయి. ఇందు 1.కామికాగమము, 2.యోగజాగమము, 3.చింత్యాగమము, 4.కారణాగమము, 5.అజితాగమము, 6.దీప్తాగమము, 7. సూక్ష్మాగమము, 8.సహస్రాగమము 9. అంశుమదాగమము,10.సుప్రభేదాగమం అనే పది మూలాగమాలు. ఇవిఈశ్వరప్రోక్తాలనీ 1.విజయాగమం,2.అనిశ్వాసాగమం, 3.స్వాయంభువాగమం, 4.వీరాగమం,5. రౌరవాగమం, 6.మకుటాగమం,7.మలాగమం,8.చంద్రజ్ఞానాగమం,9.బింబాగమం, 10.ప్రోద్గీతాగమం, 11.లలితాగమం,12.సిద్ధాగమం,13.శాంతాగమం, 14.సర్వోత్తరాగమం, 15.పారమేశ్వరాగమం,16.కిరణాగమం, 17.ఆనలాగమం, 18.వాతూలాగమం, అనే పద్దెనిమిది రుద్రాగమాలు. ఇవి మనుష్య సంపాదితాలని అంటారు. వీనన్నింటిసారమే పౌష్కరాగమము. తమిళనాడులోని శైవసిద్ధాంత సంప్రదాయం వారు కర్ణాటకలోని వీరశైవ సంప్రదాయం వారు, కాశ్మీరులోని ప్రత్యభిజ్ఞా సాంప్రదాయికులు ఈ 28 శైవాగమాలను ప్రమాణాలుగా అంగీకరిస్తారు.

ఈశైవాగమా లన్నీ ప్రతి ఒక్కొక్కటి 1.చర్యాపాదం, 2.క్రియాపాదం, 3.యోగపాదం, 4.జ్ఞానపాదమని నాలుగు పాదాలు కలిగి వున్నాయి. ఈ నాల్గుపాదాల్లో జ్ఞానపాదం చాలా ముఖ్యం. పశువు అనబడే జీవుడు బద్ధుడైన దశలో ప్రపంచంతో అనురాగం గల్గి దానిలో లీనమౌతున్నాడు. అదే బద్ధదశ. ఆజీవుడే పాశంతో ప్రపంచంతో సంబంధాన్ని వదలి పతియగు శివునితో సంబంధం పెంచుకొని అద్వైత స్థితిని పొంది ముక్తుడవుతున్నాడు. పశు అనుజీవుడు పతి అనబడే పరమేశ్వరుని కృపావిశేషం చేత పాశచ్ఛేదం చేసుకొని పరమేశ్వరుని పాదసన్నిధిలో శాశ్వతానందాన్ని పొందుతాడు.

శివుడు ఇంద్రియగోచరుడు కాదు. భక్తుడు తన ఆధ్యాత్మికతత్త్వానుభవంచేత శివుని గుర్తించాలి. దానికి తార్కిక పద్ధతి పనికిరాదు అంటాడు. జ్ఞానసంబంధర్. శివతత్త్వం 1.నిష్కళాతత్త్వం (పరమేశ్వరతత్త్వం)2. సకలాతత్త్వం అని రెండు విధాలు. మొదటిదైన నిష్కళాతత్త్వాన్ని స్వరూపలక్షణమనీ, రెండవదైన సకలాతత్త్వాన్ని తటస్థలక్షణమని అంటారు. నిష్కళాతత్త్వం వాక్కుకు, మనస్సుకు క్రియకు గోచరం కానిది. ఈశ్వర కరుణా విశేషంచేత పరిణత జీవులకు జ్ఞానగోచరమై ముక్తినిస్తుంది. శివతత్త్వం జీవులను కర్మముక్తులను చేయుటకై సృష్టి-స్థితి-సంహార-తిరోధాన -అనుగ్రహము అనుఅయిదు క్రియా కలాపములందు ప్రవర్తింప జేస్తుంది. ఈ క్రియా కలాపమంతా

శివునికరుణా విశేషంచేత జీవులను ముక్తులుగా చేస్తుంది.

శైవసిద్ధాంతంలో కార్యక్రమసంబంధం ప్రధానసూత్రం. కార్యానికి సాధారణ కారణాలు. 1.నిమిత్త కారణం, 2.ఉపాదానకారణం, 3.సహకారి కారణం అని మూడువిధాలు. ఈసృష్టికి శివుడు నిమిత్తకారణం, శక్తి సహకార కారణం, మాయ ఉపాదానకారణం, ఇందులో సృష్టికి శివుడు కేవలం నిమిత్త కారణ మని ప్రతిపాదించడం ఈ సిద్ధాంతముఖ్యవిషయం. శివుడు లేనిదానిని సృష్టించడు. ఉన్నదానిని నశింపజేయడు. ఈ సిద్ధాంతం ప్రకారం పదార్థం నశించదు. అది అవసరాన్ని బట్టి రూపాంతరాన్ని పొందుతుంది.

శివతత్త్వం కార్యాచరణకాలంలో శక్తితత్త్వంతో కూడి వుంటుంది. ఈ శక్తితత్త్వం శివుని ఇచ్ఛాశక్తికీ, జ్ఞానశక్తికీ ప్రతినిధి. ఇది శివునితో అవినాభావసంబంధం గలది. నిరంతర ప్రయత్నంలో జీవితకాలమంతా సాధన చేస్తే జీవులకు మోక్షం లభిస్తుంది. ఈసాధన ఒక క్రమంలో జరగాలి. దానికి నాల్గు దశలు. 1.చర్య,2.క్రియ, 3.యోగం, 4.జ్ఞానం అని. ఈ నాల్గు దశలతో మోక్షం పొందాలంటే దానికి దీక్ష అవసరం.

సాధన నాల్గు దశలు :

1.చర్య : చర్య అంటే సేవ. శివుని పత్రపుష్పాదులతో పూజించడం చర్య అనబడుతుంది, ఇది ప్రాథమికదశ. దీన్ని దాసమార్గం అంటారు.

2.క్రియ : క్రియ అంటే శివుని సాకారునిగాను, నిరాకారునిగాను భావించి సేవ చేయుట. దీనిని సత్పుత్రమార్గ మంటారు. దీనిలో మంత్రోచ్చారణ ప్రధానం. ఇందు క్రియ పంచాక్షర్యాది మంత్రజపంచేత జీవుని మంత్రార్థం వైపు మళ్ళిస్తుంది.

3.యోగం : ఇది జీవుడు తన శరీరంలోని నాడీ మండలజ్ఞానాన్ని పొంది ప్రవర్తించు విధము. సాధకుడు కామ క్రోధాదుల నన్నింటిని జయించి ప్రాణులందరిని ప్రేమిస్తేనే ఈయోగం లభ్యమవుతుంది.

4. జ్ఞానం : ఇది కడపటి సాధన. ఇచట జీవుడు తురీయాతీతావస్థలో ప్రవేశిస్తాడు. దీనిద్వారా జీవునికి శివునిసాయుజ్యం కల్గుతుంది. శివసాయుజ్యమే ముక్తి, మోక్షం. భక్తి వీటన్నింటికి మూలం. ఈశైవ సిద్ధాంతాన్ని తమిళ, కర్ణాటక రాష్ట్రాలలో మఠాధిపతులు బాగా రక్షించారు.

(సశేషం)

వార్తలు

(01). హైద్రాబాద్ - మల్కాజిగిరి శ్రీమాణయ్య గారి సత్సంగసనాతన బ్రహ్మజ్ఞాన సభలు లాలాగూడ రైల్వే కాలనీలోని మహాలక్ష్మి దేవాలయసమూహ ప్రాంగణంలో 31-1-2018వ తేది నుండి 2-2-18 తేది వరకు జరిగినవి. అందు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొని 1-2-2018తేది అనుగ్రహ భాషణం చేశారు.

(02). జగిత్యాల జిల్లా మెట్పల్లిలో శ్రీసత్యానంద మహర్షుల వారి సంచార సత్సంగ 400వ సభలు చాలా ఘనంగా జరిగినవి. అందు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని 2-2-18తేది, 4-2-18తేది ప్రవచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుండి అనేకమంది సుప్రసిద్ధ మహాత్ములు సభలలో పాల్గొని ప్రవచనలు చేశారు. వెయ్యిమంది శ్రోతలు రోజూ సభలలో పాల్గొన్నారు.

(03). 13-2-18 తేది మంగళవారం మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 10 గం॥ల నుండి తెల్లవారి 6 గంటలవరకు ఆశ్రమ శివాలయంలో శివలింగమునకు ఏకాదశ రుద్రాభిషేకము, లక్షబిల్వ సమూహస హస్రనామార్చన శ్రీకృష్ణానందస్వామి ఆచార్యత్వంలో చాలా ఘనంగా జరిగినవి.

(04).17-2-2018 తేది శ్రీరామకృష్ణపరమహంస జన్మదినోత్సవం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో ఘనంగా జరిగినది. ఆ సందర్భంగా శ్రీ పరమహంస చిత్రానికి అర్చన షోడశోపచారపూజ జరిపి ప్రసాద వినియోగం చేయబడినది.

(05).అఖిలాంధ్ర సాధుపరిషత్ 53వ మహాసభలు ఫిబ్రవరి 16,17,18 తేదీలలో విశాఖపట్టణం ఎం.వి.పి.కాలనీలోని టిటిడి కళ్యాణ మండపంలో జరిగినవి. అందు శ్రీవిద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొని 16 తేది మహాసభల ప్రారంభోత్సవం చేసి ఉపన్యసించారు.

(6). గుంటూరుజిల్లా తాడేపల్లి పంచాయితీలోని శ్రీచైతన్య తపోవనంలో ఫిబ్రవరి 24,25,26 తేదీలందు జరిగిన వార్షికోత్సవంలో 24 తేది శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని ఉపన్యసించారు.

(7). 25.3.2018 తేది శ్రీరామనవమి సందర్భంగా ఆశ్రమంలో శ్రీరామచంద్రునికి విశేష పూ. జరుగును.

(8). ఆశ్రమ కంటిఆసుపత్రిలో జనవరి నెలలో ఓ.పి.లో **466** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేయబడినవి. **19** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **ఇద్దరికి** యాగ్ లేజర్ చికిత్సలు జరిగినవి. **2** గ్రామాలలో కంటి వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి.